



● కంపచెట్ల తొలగింపు తరువాత మంత్రుల భవన సముదాయం




కంపచెట్ల నడుమ హైకోర్టు భవనం, ఐఏఎస్ అధికారుల భవనాలు

- ఐదేళ్ల నిర్లక్ష్యం ఫలితంగా అడవిలా అమరావతి
- 26 వేల ఎకరాల్లో కంపచెట్లతో చిట్టడవిలా రాజధాని
- ప్రభుత్వ భవనాలను కమ్మేసిన కర్రతుమ్మ కంప చెట్లు
- కంపచెట్ల తొలగింపుతోనే నవనగర పునర్నిర్మాణం
- కంపచెట్ల తొలగింపుతో మారుతున్న రూపురేఖలు
- హుందాగా సిద్ధమవుతున్న రాజధాని రహదారులు



● కొత్త సొబగులు అద్దుకున్న ఉద్యోగుల భవన సముదాయం




నాడు అడవిలా.. నేడు అందంగా



● కంపచెట్ల మధ్య క్లాస్-4 ఉద్యోగుల భవన సముదాయం



● కంపచెట్ల మధ్య ఎన్ఐడీ, విట్ విద్యా సంస్థలు



● కంప చెట్లలో కనపడకుండా పోయిన నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన షెడ్లు

అద్భుత నగరంగా విరాజిల్లాల్సిన అమరావతి ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం నిర్వాకం పుణ్యమా అని అడవిలా మారిపోయింది. వైసీపీ పాలకుల నిర్లక్ష్యానికి బలైపోయింది. గత టీడీపీ ప్రభుత్వం 2014- 19 మధ్య నిర్మిం చిన ప్రభుత్వ భవనాలు, విద్యాసంస్థలు తప్ప మిగిలిన ప్రాంతమంతా అడవిలా మారిపోయింది. కోర్ క్యాపిటల్‌లో అడుగు స్థలం కూడా ఖాళీ లేకుండా కంప చెట్లు పెరిగి పోయాయి. మొత్తంగా 26వేల ఎక రాల్లో కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఐదేళ్ల లో అడవిలా మారిన అమరావతి కూటమి ప్రభుత్వంలో కొత్త ఊపిరిలు పోసుకుం టోంది. జవసత్వాలు నింపుకుని ఠీవీగా నిలిచేందుకు తపన పడుతోంది. అమరావతిని మింగే సిన కంపచెట్లపైనే కూటమి ప్రభుత్వం ఎక్కుపెట్టింది. కంప చెట్ల తొలగింపుతో నవ్యాధ్ర పునర్నిర్మాణానికి నాంది పలికింది.

గుంటూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): 2019 డిసెంబర్‌లో వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల సిద్ధాంతాన్ని తెరమీదకు తెచ్చి రాజధాని అమరావతి ధ్వంస రచనకు స్వీకారం చుట్టింది. రాజధాని పరిధిలో వున్న 29 గ్రామాలు, రైతులు ఇచ్చిన భూములు అన్నీ గత ప్రభుత్వ వికృత క్రీడలో నాశనమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా కేంద్రంగా ఉండే కోర్ క్యాపిటల్ కర్రతుమ్మ చెట్లతో చిట్టడవిలా మారిపోయింది. కోర్ క్యాపిటల్‌లో సెక్రటేరియట్ టవర్స్ నీటిలో మునిగిపోగా, ఐకానిక్ టవర్స్, అసెంబ్లీ, రాష్ట్ర హైకోర్టు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రులు, న్యాయమూర్తులు, ప్రిన్సిపల్ కార్యదర్శులకు నివాసాలు, ఐఏఎస్ అధికారులు, సెక్రటేరియట్ ఉద్యోగుల కోసం నిర్మించిన భారీ భవన సముదాయాలు కంపచెట్ల పాలయ్యాయి. భవనాల సంగతి ఎలా ఉన్నా నిర్వహణను కూడా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో రోడ్లు, రైతుల ప్లాట్లు సహా ఖాళీ ప్రదేశమంతా తుమ్మచెట్లతో నిండిపోయింది. ప్రభుత్వ భవన సముదాయాలకు వెళ్లే దారులు కూడా కనిపించనంతగా తుమ్మకర్ర పెరిగిపోయింది. కేంద్ర సంస్థలకు కర్రతుమ్మ బెడద తప్పలేదు. విట్, ఎన్ఐడీ వంటి ప్రతిష్టాత్మక కేంద్ర సంస్థలు టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అమరావతిలో తమ కార్యకలాపాలు ప్రారంభించాయి. గడిచిన ఐదేళ్లుగా వేలాది మంది విద్యార్థులు అక్కడ విద్యాభ్యాసం చేస్తున్నారు. ప్రతిరోజూ పదుల సంఖ్యలో విద్యాసంస్థల బస్సులు, వందల సంఖ్యలో ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అయినా సరే రోడ్లు పడలేదు. కర్రతుమ్మ బెడద తప్పలేదు.

● మారుతున్న రూపురేఖలు

అమరావతి అడవిలా మారిపోయిన విషయాన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు చేపట్టారు. ప్రమాణ స్వీకారానికి రెండు రోజుల ముందే జూన్ 11న జంగిల్ క్లియరెన్సుకు టెండర్లు ఆహ్వానించారు. దాదాపు 200 ఎక్సకవేటర్లతో పనులు ప్రారంభించారు. తొలి అడుగుగా ప్రభుత్వ భవనాలు, ప్రధాన రహదారులను చుట్టుముట్టిన కంపచెట్ల తొలగింపుకు పూనుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, శాసన సభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు నెల రోజుల్లో రెండుసార్లు పర్యటించి పనుల తీరును పరిశీలించారు. అధికారులను పరుగులు పెట్టించారు. కేంద్ర పెద్దలను ఒప్పించి అమరావతి కోసం నిధులు మంజూరు చేయించే ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లారు. ప్రభుత్వ చిత్తశుద్ధి కారణంగా గడిచిన నెలరోజుల్లో యుద్ధ ప్రాతిపదికన పనులు సాగుతుండడంతో అమరావతి రూపురేఖలు చాలా వరకూ మారిపోయాయి. కొత్త సొబగులు అద్దుకుంటున్నాయి. నిన్నటి వరకూ దుమ్ము, ధూళితో బూజుపట్టిన ప్రభుత్వ భవనాలు దుమ్ము దులుపుకుని అందంగా ముస్తాబవుతున్నాయి. ఎమ్మెల్యే క్వార్టర్లు, మంత్రుల భవనాలు, ప్రిన్సిపల్ సెక్రటరీల నివాసాలు, క్లాస్-4 ఉద్యోగుల భవన సముదాయాలు దర్జాగా సిద్ధమవుతున్నాయి. తొలగించిన కంప చెట్ల మధ్య ఠీవీగా తలెత్తుకు నిలుచున్నాయి. ఆకాశాన్ని తాకే అద్భుత భవనాలు నవనగరానికి కొత్త శోభనిస్తున్నాయి. సీడ్ యాక్సిస్ రోడ్డు సహా అనేక రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కంపచెట్లను తొలగించి రోడ్లను విస్తరించి తిరిగి పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు ప్రయత్నిస్తోంది. అందమైన రోడ్లు నేడు హుందాగా ప్రజలకు దర్శనమిస్తున్నాయి. రోడ్లకు ఇరుపక్కలా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, వీధి దీపాలు సిద్ధం చేస్తున్నారు. తద్వారా అమరావతిలో కొత్త వెలుగులు రాబోతున్నాయి.



కంపచెట్లు తొలగించిన తర్వాత హైకోర్టుకు వెళ్లే రోడ్డు

● 26వేల ఎకరాల జంగిల్ క్లియరెన్సుకు శ్రీకారం

ప్రభుత్వ భవనాల పనులు పురోగమిస్తున్న క్రమంలో క్రమంలో మిగిలిన పనులపై ప్రభుత్వం దృష్టి సారించింది. రాజధాని పరిదిలో 26 ఎకరాల్లో అడవిలా పెరిగిన కంపచెట్ల తొలగింపుపై ప్రభుత్వ దృష్టిపెట్టింది. కంప చెట్ల తొలగింపునకు సంబంధించి 30 కోట్ల రూపాయల వరకూ ఖర్చు అవుతుందని అధికారుల అంచనా వేశారు. టెండర్ల ప్రక్రియలో భారీ కంపెనీలు పాల్గొంటున్నట్లు అధికారుల ద్వారా అందుతున్న సమాచారం. ఈ ప్రక్రియ కూడా ఈ వారంలో పూర్తయ్యే అవకాశం కనిపిస్తోంది. టెండర్లు ఖరారైన నెల రోజుల్లోపు కంపచెట్లను తొలగించి రాజధాని రూపురేఖలు మార్చాలని కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

రాయితీపై.. సరుకులు



- దేశవాళి కందిపప్పు కేజీ రూ. 160
- నాణ్యమైన స్టీమ్ బియ్యం (బీపీటీ రకం) కేజీ రూ. 49
- రా బియ్యం కేజీ రూ. 48

గుంటూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కందిపప్పు, బియ్యం ధరలు రిటైల్ మార్కెట్‌లో ఆకాశాన్నంటుతున్న ప్రస్తుత తరుణంలో వినియోగదారులకు కొంతమేరకు ఆర్థిక ఉపశమనం కలిగించేందుకు పౌరసరఫరాల శాఖ రంగంలోకి దిగింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని రైస్, డాల్‌మిల్లర్లతో ఆ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చర్చలు జరిపిన అనంతరం కొంత రాయితీపై కందిపప్పు, బియ్యంని రైతుబజార్లలో ప్రజలకు అందుబాటులోకి ఉంచేందుకు ముందుకొచ్చారు. రెండు, మూడు రోజుల్లో రాయితీ ధరలను బిగ్‌షైన్ మార్కెట్లలో కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, మూడు జిల్లాల పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. ఈ నెల 11వ తేదీ గురువారం గుంటూరు జిల్లాలోని పలు రైతుబజార్లు, బాపట్లలో ఆరు చోట్ల, పల్నాడు జిల్లాలో ఎనిమిది కేంద్రాల్లో సబ్సిడీ కందిపప్పు, బియ్యం విక్రయాలను ప్రారంభిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

కందిపప్పు నేడు రిటైల్ మార్కెట్‌లో రకాన్ని బట్టి రూ. 175 నుంచి రూ. 185 వరకు ఉన్నది. బ్రాండెడ్ కందిపప్పు(గుజరాత్, లాతోర్) అయితే రూ. 200 పైమాటే. మరోవైపు రేషన్ దుకాణాల్లో సబ్సిడీపై తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో విక్రయించిన సబ్సిడీ కందిపప్పుని గత వైసీపీ ప్రభుత్వం నిలిపేసింది. దీంతో చాలా మంది కందిపప్పు వాడకాన్ని తగ్గించేశారు. ప్రత్యామ్నాయంగా ఎర్రపప్పు, పెసరపప్పుని వినియోగిస్తున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కేవలం నెల రోజులు మాత్రమే అయ్యాయి. ఇప్పటికిప్పుడు రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీ కందిపప్పుని అందుబాటులోకి తీసుకురాలేని పరిస్థితి. ఇందుకు కారణం పౌరసరఫరాల సంస్థ గిడ్డంగులని తనఖా పెట్టి గత వైసీపీ ప్రభుత్వం పెద్ద మొత్తంలో అప్పులు చేసింది. ఇవన్నీ ఒక కొలిక్కి తీసుకొచ్చి అప్పులపై శ్వేతపత్రం విడుదల చేసిన అనంతరం కందిపప్పుని కొనుగోలు చేయాల్సి ఉంటుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో కేజీ కందిపప్పు రూ. 130కి సరఫరా చేసేందుకు పల్నాడు జిల్లాలోని డాల్‌మిల్లర్లు ముం దుకు రాగా వారి నుంచి కొనుగోలు చేయకుండా ప్రజలను ఇబ్బందులు పాలు చేసింది.

ఈ నేపథ్యంలో రైతుబజార్లలో దేశవాళి కందిపప్పుని వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి మనోహర్ ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు కేజీ కందిపప్పు రూ. 160, నాణ్యమైన స్టీమ్ బియ్యం(బీపీటీ వెరైటీ) కేజీ రూ. 49, రా రైస్ కేజీ రూ. 48కి ప్రత్యేక కౌంటర్లలో విక్రయించనున్నారు. గుంటూరు నగరంలోని చుట్టుగుంట, ఆర్‌టీసీ బస్టాండ్, తెనాలిలో ఉన్న రెండు, మంగళగిరి, పొన్నూరులో ఉన్న రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్లని గురువారం ఉదయం నుంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తారు. అలానే గుంటూరు నగరంలోని 15 పప్పుల హోల్‌సేల్ దుకాణాలలో కూడా దేశవాళి కందపప్పు, రైస్‌మిల్ పాయింట్ల వద్ద బీపీటీ బియ్యం పైన పేర్కొన్న ధరలకు అందుబాటులో ఉంచనున్నట్లు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. చిలకలూరిపేటలో రైతుబజార్, మరో కేంద్రం, వినుకొండ, నరసరావుపేట, పిడుగురాళ్లలో రెండు కౌంటర్లు చొప్పున ఏర్పాటు చేశారు. ఇవి ఎక్కువగా ఎంపీడీవో /తహసీల్దార్ కార్యాలయాలు, ఆర్యవైశ్య కల్యాణ మండపాల్లో ఏర్పాటు చేశారు. బాపట్ల, వేమూరు, చీరాల, రేపల్లెలోనూ ఆరు కౌంటర్లు ఏర్పాటు చేశారు. వీటిని మంత్రులు /ఎమ్మెల్యేలు గురువారం ఉదయం ప్రారంభిస్తారు.

జిల్లా అధికారులతో సమీక్షలో మంత్రులు

ఎలా ముందుకెళదాం





కలెక్టరేట్‌లో జరిగిన పరిచయ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రులు, అనగాని, గొట్టిపాటి, ఎమ్మెల్యేలు, ఎంపీ

- పరిచయ కార్యక్రమం, ఆపై వివిధ అంశాలపై చర్చ
- విభాగాల వారీగా అధికారులతో సమీక్షించిన ఎంపీ, ఎమ్మెల్యేలు
- జరిగిన విధ్వంసాన్ని పూడ్చేలా ప్రణాళికలు చెప్పండని సూచన
- నిజాంపట్నం ఆక్వా పార్క్ ప్రతిబంధకాలు తొలగిస్తా : మంత్రి అనగాని
- ఇసుక తవ్వకాలు, బినామీ వేటగాళ్లపై చర్యలు తీసుకోండి : మంత్రి రవికుమార్

బాపట్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వాస్తవ పరిస్థితి ఇది.. దీనికి మరమ్మతు చేయాలంటే ఏం చేయాలి.. నిధులు ఎంత ఉన్నాయి.. లభ్యత ఎంత.. తక్షణం చేయాల్సిన పనులేమిటి.. మొత్తం మీద ఎలా ముందుకెళ్లాలి.. ప్రజలకు ఎలా మేలు చేయాలి.. అనే దిశగా బుధ వారం బాపట్ల కలెక్టరేట్‌లో సమీక్ష జరిగింది. జిల్లా అధికారులతో పరిచయ కార్యక్రమంతో మొదలైన సమావేశం తర్వాత వైసీపీ ఐదేళ్ల పాలనలో జిల్లాలో ధ్వంసమైన వ్యవస్థల పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యల దిశగా సమీక్ష సాగింది. కలెక్టర్ వెంకటమురళి అధ్యక్షతన జరిగిన పరిచయ కార్యక్రమం, తర్వాత జరిగిన సమీక్షకి జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ హాజరయ్యారు. ఇరిగేషన్, వ్యవసాయం, ఆర్‌అండ్‌బీ, మత్స్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్ విభాగాలు ప్రాధాన్యాలుగా సమీక్ష జరిగింది. ఆయా శాఖల మీద అధికారులు ప్రజంటేషన్ ఇస్తున్నప్పుడు వాస్తవ పరిస్థితిని చెప్పడంతో పాటు విధ్వంసం జరిగిన చోట ఎలాంటి మరమ్మతులు చేపడితే రైతుల కష్టాలు గట్టెక్కుతాయో ప్రణాళిక బద్ధంగా చెప్పండని, అందరం కలిసి పనిచేసి ఫలితాలు రాబడదామని మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్‌లు అధికారులకు పిలుపిచ్చారు. గత ప్రభుత్వంలో అర్ధంతరంగా ఆపేసిన పనులపై ఎలా ముందుకెళ్లాలి అనే అంశంతో పాటు ఆ పనులకు సంబంధించిన నిధులు మురిగిపోకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని అధికారులకు సూచించారు. ఆక్వా రైతులు సాగు రిజిస్ట్రేషన్ లేక నష్టపోతున్నారని మత్స్యశాఖ జిల్లా అధికారి మంత్రి అనగాని దృష్టికి తెచ్చినప్పుడు రెవెన్యూకు సంబంధించిన క్లియరెన్స్‌లను పరిశీలించి ఆమోదిస్తానని హామీ ఇచ్చారు. నిజాంపట్నంలోని ఆక్వా పార్క్ నిర్మాణానికి ఉన్న ప్రతిబంధకాలన్నీ తొలగించి అభివృద్ధికి చర్యలు చేపడతామని తెలిపారు. గుండ్లకమ్మ నదిపై మల్లవరం డ్యాంగేట్లు లేకపోవడం బాధాకరమని మంత్రి రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. డ్యాంలో మత్స్యసంపదపై ఆధారపడి వేట సాగిస్తున్న పదివేల మంది వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్ల వీధిన పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అద్దంకి నియోజకవర్గం తిమ్మాయపాలెం, రామాయపాలెం, దర్శి వెళ్లే ప్రధాన రహదారి బ్రిడ్జి కింద జరుగుతున్న ఇసుక తవ్వకాలను అరికట్టాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి చెరువుల్లో ఇసుక తవ్వకాల వల్ల ప్రమాదం పొంచి ఉందని తెలిసినా అధికారులు ఎందుకు ఉదాసీనంగా ఉన్నారని ప్రశ్నించారు. గుండ్లకమ్మ నది, సింగరకొండ చెరువుల్లో బినామీ వేటగాళ్లను నియంత్రించాలని ఆదేశించారు. యువతలో నైపుణ్యాలు పెంపొందించి ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎంపీ కృష్ణప్రసాద్ తెలిపారు.

29.84 టీఎంసీలు అవసరం..

ప్రస్తుతం సాగునీటి వనరుల లభ్యత తక్కువగా ఉందని ఇరిగేషన్ అధికారులు చెప్పారు. పశ్చిమ కృష్ణాడెల్టా నుంచి నీటి విడుదలకు ఎదురు చూస్తున్నామన్నారు. 29.84 టీఎంసీల నీరు అవసరమని ప్రభుత్వానికి నివేదించినట్లు అధికారులు సమీక్షలో తెలిపారు. కాల్వల మరమ్మతులకు 126 పనుల నిమిత్తం రూ.10.2 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. కృష్ణ పశ్చిమ డెల్టా, సాగర్ కాల్వల నిర్వహణ గడచిన ఐదేళ్లు అధ్వానంగా ఉండడంతో పూడిక తీత పెరిగి కాల్వలపై గేట్లు కూడా దెబ్బతిన్నాయన్నారు. వర్షాలకు మిర్చిని కాపాడుకోవడానికి రైతులకు టార్పాలిన్ పట్టాలు అవసరమన్నారు. వ్యవసాయం, ఆక్వారంగాలపై ఆధారపడిన బాపట్ల జిల్లాను అగ్రగామిగా నిలబెట్టడానికి అధికారులు, ప్రజాప్రతినిధులూ అందరూ సహకరించాలని కలెక్టర్ వెంకటమురళి కోరారు. శాంతిభద్రతలు కాపాడడానికి, గంజాయి సమస్యను పూర్తిగా అరి కట్టడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విఠలేశ్వరరావు, డీఆర్‌వో సత్తిబాబుతో పాటు అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి ఎమ్మెల్యేల డిమాండ్

సీఎం చంద్రబాబునాయుడి మానస పుత్రికలైన బిందు, తుంపర సేద్యం వంటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. గడచిన ఐదేళ్లలో బిందు, తుంపర సేద్యానికి లక్ష్యాలు విధించుకోవడం తప్ప పని చేయలేదన్నారు.

● ఫార్మింగ్ సంఘాల పేరుతో రుణాల పేరిట వైసీపీ నేతలు కోట్లు దండుకున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రుల దృష్టికి వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు తీసుకొచ్చారు. పల్లెకోనలో అడ్డగోలుగా ఆక్వా చెరువులు తవ్విన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కొల్లూరులో ఇటుక రాయి బట్టీల కొరకు జరుగుతున్న అక్రమ తవ్వకాలను అరికట్టాలన్నారు. సాగునీటి కాల్వల మరమ్మతులపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందున్నారు

● బాపట్లలో గంజాయిని అరికట్టాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ డిమాండ్ చేశారు. ఇసుక మాఫియా వల్ల కృపానగర్, దేవాయిపేట, ప్రాంతంలో కాల్వలు ఆక్రమణలకు గురయ్యాయని, సముద్రాన్ని కూడా వదలకుండా తవ్వకాలు జరిపారన్నారు. ఇసుక దందాలో కీలకంగా వ్యవహరించిన వైసీపీ నేతపై దృష్టిపెట్టాలని కలెక్టర్‌ను కోరారు. ఇష్టారీతిన ఇసుక తవ్వకాల వల్ల మత్స్యకారులు బోట్లు కూడా నిలుపుకోలేని పరిస్థితి తలెత్తిందన్నారు. కాల్వలపై బ్రిడ్జీల నిర్మాణాలకు ప్రతిపాదనలు ఇస్తానని ఎమ్మెల్యే నరేంద్రవర్మ అన్నారు.



సూర్యలంక తీరానికి పర్యాటకులకు అనుమతి

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన


చంద్రబాబు దార్శనికతకు ప్రతీక పట్టిసీమ

● జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు ● కృష్ణా పశ్చిమ డెల్టాకు 500 క్యూసెక్కుల నీటి విడుదల

6లో..



ప్రజలకు అందుబాటులో కావాల్సినంత ఇసుక


ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, జూలై 10: కూటమి ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన విధానంతో ప్రజలందరికీ స్థానికంగానే కావాల్సినంత ఇసుక అందించే అవకాశం లభించిందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ హయాంలో ట్రక్కుకు రూ.20 వేలు, ఆపైన కూడా పెట్టిన పరిస్థితులున్నాయన్నారు. ప్రస్తుతం తమ ప్రభుత్వంలో నామమాత్రపు ధరకే ఇసుక అందిస్తున్నామన్నారు. సామాన్య మధ్యతరగతికి అతిపెద్ద ఊరటన్నారు. పల్నాడు జిల్లాలో వైకుంఠపురం, కోనూరు, కొత్తపల్లి, మాదిపాడు, వినుకొండ, కొండమోడు స్టాక్ యార్డుల్లో సరఫరాకు ఇసుక నిల్వలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలు మాత్రమే చెల్లించి కోటా మేరకు ఇసుక తీసుకోవచ్చని ప్రజలకు తెలిపారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి అమలు చేసిన దుర్మార్గపు విధానాలు రద్దు చేయడం ద్వారానే ఇది సాధ్యమైందన్నారు. ఇకపై దళారీలకు వేల రూపాయలు కప్పం కట్టాల్సిన పని లేదని, ఇసుక దొరుకుతుందో లేదో ఇంటి పనులు ముందుకు సాగుతాయో లేదో అన్న భయాలు ఇక అవసరం లేదన్నారు. దీని ద్వారా భవన నిర్మాణ కార్మికులు ఆ రంగంపై ఆధారపడిన ఇతర విభాగాల వారు ఉపాధి, వ్యాపార అవకాశాల విషయంలో బెంగ పెట్టుకోనక్కర్లేదన్నారు. ఇసుక విషయంలో ఊరటనిచ్చిన సీఎం చంద్రబాబుకు ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు తెలిపారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ బ్యాటరీలు చోరీ

గుంటూరు, జూలై 10: నగరం నడిబొడ్డున హిందూ కళాశాల కూడలిలో ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ కోసం ఏర్పాటుచేసిన బ్యాటరీలను దొంగలు అపహరించుకుపోయారు నిత్యం వ్యాధి వాహనాల రాకపోకలు సాగించే ఈ ప్రధాన జంక్షన్ లో ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ కు సంబంధించిన పోల్స్ కు ఏర్పాటు చేసిన బ్యాటరీలను దొంగలు అపహరించడం కలకలం రేపింది. గుంటూరు నగరంలోని అత్యంత ట్రాఫిక్ రద్దీ కలిగిన ప్రదేశం హిందూ కళాశాల కూడలి. అక్కడ పగలే కాకుండా రాత్రివేళ కూడా వాహన రాకపోకలు కొనసాగుతుంటాయి. అయితే అటువంటి సెంటర్ లో దొంగలు బ్యాటరీలు అపహరించుకుపోవడం గమనార్హం. ఈ ప్రాంతంలో సిగ్నల్ లైట్స్ కోసం మూడు రోజుల క్రితమే ట్రాఫిక్ పోలీసులు కొత్తగా మూడు బ్యాటరీలు అమర్చారు. అయితే బుధవారం ఉదయం ట్రాఫిక్ పోలీసులు వచ్చి చూడగా సిగ్నల్స్ వెలగడం లేదు. దీంతో బాక్సులను తెరిచి చూడగా అందులో ఉండాల్సిన బ్యాటరీలు కనిపించలేదు. పోలీసుల ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు ఇక్కడ ఉన్న సీసీ కెమెరాలు కూడా పనిచేయకపోవడం పట్ల సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

చంద్రబాబు దార్శనికతకు ప్రతీక పట్టిసీమ

- జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు
- కృష్ణా పశ్చిమ డెల్టాకు 500 క్యూసెక్కుల నీటి విడుదల


నీటి విడుదల అనంతరం పసుపు, కుంకమ సారెను వదులుతున్న మంత్రి నిమ్మల

తాడేపల్లి టౌన్, జూలై 10: సీఎం చంద్రబాబు దార్శనికతకు, ముందుచూపునకు నిదర్శనమే పట్టిసీమ ప్రాజెక్టు అని రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ప్రకాశం బ్యారేజి వద్ద పశ్చిమ హెడ్ రెగ్యులేటర్ నుంచి బుధవారం బటన్ నొక్కి మంత్రి నీటిని వదిలారు. ఒక గేటును 2 అడుగుల మేర ఎత్తి 500 క్యూసెక్కుల నీటిని తాగు, సాగునీటి అవసరాల కోసం పశ్చిమ డెల్టాకు విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కృష్ణానది జలాలు ఆల్‌మట్టి నుంచి నాగార్జున సాగర్‌కు వచ్చే సరికి ఆగస్టు 2వ వారమవుతుందన్నారు. ఈ లోపు జూలైలో తాగునీటి అవసరాలు తీర్చడానికి, ఖరీఫ్ సీజన్ తొందరగా ప్రారంభించి ఆరుమడి వేసుకోవడానికి పులిచింతల బాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించుకున్నామన్నారు. ఏ ప్రభుత్వం ఉన్నా ఆ రిజర్వాయర్‌లో 30-40 టీఎంసీల నీటిని రిజర్వు చేసుకుని జూలైలో కృష్ణా డెల్టాకు విడుదల చేస్తుంటారని చెప్పారు. పులిచింతలలో 30 టీఎంసీల మాట అటుంచి కనీసం అర టీఎంసీ నీరు కూడా నిల్వ పెట్టలేదన్నారు. నీటిని వృథాగా సముద్రంలోకి వదిలివేసి కృష్ణా డెల్టా ప్రజలకు జగన్ ద్రోహం చేశారని విమర్శించారు. ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలని, దాన్ని ఆఖరి ఎకరా వరకు తీసుకెళ్లాలని సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు తాము నడుచుకుంటున్నట్లు చెప్పారు. నాలుగేళ్ల నుంచి నిర్వహణ లేకపోయినా పట్టిసీమ వద్ద యుద్ధప్రాతిపదికన తుప్పు పట్టిపోయిన మోటార్లకు మరమ్మతులు నిర్వహించి గోదావరి జలాలను కృష్ణమ్మ చెంతకు తీసుకువచ్చినట్లు చెప్పారు. పట్టిసీమ పురుషోత్తమపట్నం, తాడిపూడిలను చక్కబెట్టుకుంటూ వచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ ఇంజనీరింగ్ చీఫ్ నారాయణరెడ్డి, ఎస్ఈ ఉమామహేశ్వరరావు, ఈఈ మల్లికార్జునరావు, డీఈ ప్రసాద్, బ్యారేజి జేఈ దినేష్, ఏఈ వనిత, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్ధయ్య, తాడేపల్లి పట్టణ, మండల టీడీపీ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, అమరా సుబ్బారావు, మండవ గోపాలరావు, మండల జనసేన అధ్యక్షుడు సామల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



వర్సిటీ మెయిన్ గేట్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి జేఏసీ నాయకులు

వర్సిటీలో అక్రమాలపై సిట్‌తో విచారణ చేయాలి

విద్యార్థి జేఏసీ నాయకుల ధర్నా.. డిమాండ్

పెదకాకాని, జూలై 10: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన అవినీతి అక్రమాలపై సిట్ కమిటీ ద్వారా విచారణ చేయాలని విద్యార్థి జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వర్సిటీ మెయిన్ గేటు దగ్గర నిరసన ప్రదర్శన, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థి జేఏసీ రాష్ట్ర నాయకులు రాయపాటి జగదీష్ మాట్లాడుతూ 2019 నుంచి 2024 జూన్ వరకు వర్సిటీలో రూ.30 లక్షలు వరకు నిబంధనలకు విరుద్ధంగా వీసీ మంజూరు చేశారన్నారు. వర్సిటీలో విద్యార్థుల కోసం అభివృద్ధి చేయాల్సిన నిధులను పందికొక్కుల్లా పంచుకున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి ఆదేశాలతో వర్సిటీ నిధులన్నీ కూడా పక్కదోవ పట్టాయన్నారు. ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్లో మట్టికి కూడా బిల్లులు పెట్టి లక్షల్లో శాంక్షన్ చేసుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని 14 యూనివర్సిటీలపై విచారణకు సిట్ కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రి లోకేశ్‌ను కోరారు. ఆంధ్ర యూనివర్సిటీ ప్రసాద్‌రెడ్డి దగ్గర నుంచి నాగార్జున యూనివర్సిటీ రాజశేఖర్ వరకు అందరిపైనా చర్యలు తీసుకోవాలన్నారు. సేవ్ నాగార్జున యూనివర్సిటీ పేరుతో ఎమ్మెల్యేలకు, మంత్రులకు వినతిపత్రాలు అందిస్తామన్నారు. గెస్ట్ ఫ్యాకల్టీ ఔట్‌సోర్సింగ్ నియామకాలపై కూడా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. వర్సిటీలో విగ్రహాల ఏర్పాటులో కూడా అవినీతి జరిగిందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ జిల్లా అధ్యక్షులు నంబూరు శాస్త్రి, నంబూరు రాజేష్, రాము, శ్యామ్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మాచర్లటౌన్, జూలై 10: టీ తాగేందుకు వచ్చి రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన పట్టణంలోని చెన్నకేశవకాలనీ సమీపంలో బుధవారం జరిగింది. మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన బొంతగాని శ్రీనివాసరావు గౌడ్(45) గ్రామంలో టెంట్‌హౌస్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఉదయాన్నే టెంట్ హౌస్ తెరిచి టీ తాగేందుకు మాచర్లకి కాలినడకన బయలుదేరాడు. మార్గమధ్యలో చెన్నకేశవకాలనీ వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొంది. శ్రీనివాసరావు గౌడ్ కిందపడిపోగా అతడిపై నుంచి వాహనం వెళ్లడంతో తల ఛిద్రమైంది. పట్టణ సీఐ బొప్పన బ్రహ్మయ్య సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించి మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడికి భార్య అనూష, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

అమరావతిలో 10 కేజీల గంజాయి స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, ద్విచక్రవాహనం

అమరావతి, జూలై 10: అమరావతి మండలం దిడుగు గ్రామంలో బుధవారం పది కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని సత్రం మర్రి చెట్టువద్ద స్థానిక పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్ర వాహనంపై గంజాయి ప్యాకెట్లను తీసుకెళ్తున్న ఇద్దరు యువకులను గుర్తించారు. వారిని విచారించగా దిడుగు గ్రామానికి చెందిన దున్నా ప్రభుదాసుకు ఇచ్చేందుకు గంజాయిని తీసుకువస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలానికి చెందిన ఆడెంగుల రవికుమార్, గెర్ల బాబు తెలిపారు. దిడుగు గ్రామానికి చెందిన ప్రభుదాసు పాడేరుకు చెందిన ఇద్దరితో గంజాయి వ్యాపారం చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. సీఐ మంగారావు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన కౌలు రైతు మృతి

దుర్గి, జూలై 10: అప్పుల భారంతో ఆత్మహత్యకు యత్నించిన దుర్గి మండలం శ్యామరాజపురానికి చెందిన కౌలు రైతు యంగ్ర పోతురాజు(50) బుధవారం మృతి చెందాడు. పదెకరాలు కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేశాడు. పంటలు సరిగా పండక, సరైన దిగుబడి రాకపోవడంతో రూ.10 లక్షల దాకా అప్పులయ్యాయి. అప్పు తీర్చే మార్గం కనిపించక మనస్థాపంతో సాగు చేస్తున్న పొలంలోనే ఈ నెల 3న పురుగుమందు తాగాడు. గుర్తించిన కుటుంబసభ్యులు నరసరావుపేటలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య వెంకట్రావమ్మ, ముగ్గురు సంతానం ఉన్నారు.

దాడి కేసులో శిక్ష ఖరారు

నరసరావుపేట లీగల్, జూలై 10: దాడి కేసులో నేరం రుజువవ్వడంతో నిందితుడు చిలకలూరిపేటకు చెందిన దారా బాబుకు దిగువ కోర్టు విధించిన రెండేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానాను ఖరారు చేస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా కోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. నిందితుడు 2018 జూలై 15న స్వల్ప వివాదం నేపథ్యంలో తను ఉండే ప్రాంతానికి చెందిన గోనుగుంట్ల వెంకయ్యపై దాడి చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న చిలకలూరిపేట పట్టణ పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడ్ని అరెస్టు చేసి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువవ్వటంతో శిక్ష విధిస్తూ చిలకలూరిపేట కోర్టు తీర్పు వెలువరించింది. నిందితుడు జిల్లా కోర్టులో అప్పీలు చేసుకోగా ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయ స్థానం దిగువ కోర్టు తీర్పును ఖరారు చేసింది. ప్రాసిక్యూషన్‌ను ఏపీపీ మల్లారెడ్డి నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నాదెండ్ల, జూలై 10: గుంటూరు - కర్నూలు రహదారిపై సాతులూరు గ్రామ పరిధిలో జరిగిన ప్రమాదంలో కోరుమళ్ళ వెంకట రమణ(26) అనే యువకుడు మృతి చెందాడు. ప్రకాశం జిల్లా పెద అరవీడు మండలం రామాయపాలేనికి చెందిన వెంకటరమణకు భట్టిప్రోలుకు చెందిన చింతగింజల దివ్యశ్రీతో ఐదు నెలల క్రితం వివాహం జరిగింది. ఈ క్రమంలో శుభ కార్యక్రమంలో పాల్గొనేందుకు భట్టిప్రోలు వచ్చిన భార్యభర్తలు బైక్‌పై రామాయపాలేనికి మంగళవారం రాత్రి బయలు దేరారు. సుమారు 11 గంటల సమయంలో నరసరావుపేట నుంచి ఎదురు వస్తున్న ఆటో వారి బైక్‌ను సాతులూరు జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో వీరిని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకట రమణ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన భార్య దివ్యశ్రీని 108లో నరసరావుపేట తరలించారు. నాదెండ్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డం గ్యాంగ్‌పై చర్యలు తీసుకోండి

ప్రజాదర్బార్‌కు రాష్ట్ర వ్యాప్తంగా అర్జీదారుల రాక.. ● ఓపిగ్గా సమస్యలు వింటూ భరోసా ఇస్తున్న మంత్రి లోకేశ్


అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

తాడేపల్లి, జులై 10: రాష్ట్ర ఐటిశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రవేశపెట్టిన ప్రజాదర్బార్‌కు రాష్ట్రవ్యాప్తంగా స్పందన లభిస్తోంది. అన్ని ప్రాంతాల నుండి పలువురు అర్జీదారులు తమ సమస్యలు చెప్పుకునేందుకు ఉండవల్లిలోని లోకేశ్ ఇంటి వద్దకు రావడంతో కరకట్టపై భారీగా బారులు తీరిన ప్రజలు కనబడుతున్నారు. ఉదయం 5 గంటలకే అర్జీదారులు వస్తుండడంతో కరకట్ట ప్రాంతం కళకళలాడుతోంది. దివ్యాంగులు సైతం లోకేశ్ భరోసా కోసం ఆశగా అర్జీలు తీసుకుని తమ కుటుంబసభ్యులతో లోకేశ్‌ను కలిసి సమస్యలు విన్నవిస్తున్నారు. లోకేశ్ ఓపిగ్గా అర్జీదారుల సమస్యలు విని పరిష్కారానికి భరోసా ఇస్తూ వాటిని సంబంధిత శాఖలకు పంపిస్తున్నారు. పలువురు ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని, అనారోగ్యంతో బాధపడుతున్నామని ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అన్యాక్రాంతమైన భూముల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

కృష్ణా జిల్లా గుడివాడలో గడ్డం గ్యాంగ్ ఆగడాలకు తీవ్రంగా నష్టపోయాయనని సదరు గ్యాంగ్‌పై చర్యలు తీసుకోవాలని ముసునూరు హరికృష్ణ మంత్రి లోకేశ్‌ను కలిసి ఫిర్యాదు చేశాడు. ఏపి స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ సంస్థలో ఎంఎస్‌వోగా, ఆపరేటర్‌గా పని చేస్తున్నానని, 2017లో ఏపి టిడ్కో గృహాలకు ఫైబర్ నెట్ ప్రసారాలు అందించాలని అప్పటి ప్రభుత్వం ఆదేశించింది. దీంతో సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని 50లక్షల వ్యయంతో వైరింగ్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రసారాలు అందించానని వైసీపీ ప్రభుత్వం వచ్చాక అప్పటి గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని అండతో గడ్డం గ్యాంగ్ రంగంలోకి దిగి ఫైబర్‌నెట్ సిగ్నల్ వ్యవస్థకు విద్యుత్ ప్రసారం కాకుండా అడ్డుకుని తనను తీవ్రంగా వేధించి వైర్లను ధ్వంసం చేసి నష్టపరిచారని వారిపై చర్యలు తీసుకుని తనకు రక్షణ కల్పించాలని హరికృష్ణ కోరారు. చర్యలు తీసుకుంటామన్న లోకేశ్ హరికృష్ణకు భరోసా ఇచ్చారు. మూడు దశాబ్దాలుగా మంగళగిరి ఏపిఎస్‌పి బెటాలియన్ వద్ద నివసిస్తున్న తమకు దారి సమస్య ఉందని పరిష్కరించాలని ఏపిఎస్‌పి విశ్రాంత ఉద్యోగులు లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. స్టేట్ పోలీస్ అసోసియేషన్ ఎన్నికల కాలపరిమితి ముగిసినందున తిరిగి ఎన్నికలు నిర్వహించాలని మంగళగిరి 6వ బెటాలియన్ సిబ్బంది కోరారు. సీపీఎస్ విధానం అమలు తేదీ కంటే ముందే నియామక పత్రాలు పొందిన తమకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని 2003 బ్యాచ్ పోలీసు కానిస్టేబుళ్లు విజ్ఞప్తి చేశారు. పవులూరు దివ్యాంగులు తమ సమస్యలను లోకేశ్ దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పలువురు తమ సొంత సమస్యలతో లోకేష్‌ను కలువగా వారి సమస్యల పరిష్కారానికి తగిన ఆదేశాలు జారీ చేశారు.

సూర్యలంక తీరానికి పర్యాటకులకు అనుమతి

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన.. చిరువ్యాపారుల హర్షం


సూర్యలంక సముద్రతీరంలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

బాపట్ల, జూలై 10 : ప్రముఖ పర్యాటక కేంద్రం సూర్యలంక సముద్ర తీరంలో పర్యాటకుల రాకపోకలను గత నెల 24వ తేది నుంచి తాత్కాలికంగా నిషేధించారు. వరుస ప్రమాదాల నేపథ్యంలో పర్యాటకుల రాకపోకలను పోలీసు అధికారులు నిలిపివేయటంతో చిరువ్యాపారుల జీవనం అస్తవ్యస్తంగా మారింది. ఈ విషయమై బుధవారం ఆంధ్రజ్యోతిలో వెలువడిన సూర్యలంక తీరంలో దుకాణాల మూత, కొనసాగుతున్న పర్యాటకుల నిషేధం, నిర్మానుష్యంగా సముద్రతీరం, చిరువ్యాపారులపై తీవ్రప్రభావం అంటూ వెలువడిన కథనంపై జిల్లా పోలీసు అధికారులు స్పందించారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు డీఎస్పీ సీహెచ్ మురళీ కృష్ణ ఆధ్వర్యంలో రూరల్ సీఐ శ్రీహరి పర్యవేక్షణలో పర్యాటకులకు అనుమతినిచ్చారు. దీంతో సూర్యలంక తీరానికి బుధవారం నెమ్మదిగా పర్యాటకుల రాకపోకలు సాగాయి. పోలీసులు అనుమతిచ్చారని తెలుసుకున్న పర్యాటకులు, చిరువ్యాపారులు సంతోషంతో సూర్యలంక తీరానికి వచ్చి స్నానాలు చేస్తూ సందడి చేశారు. పర్యాటకులు మద్యం సేవించి సముద్రంలోకి వెళ్ళరాదని లోతుకు వెళ్ళి ప్రమాదాలు తెచ్చుకోవద్దుఅని రూరల్ సీఐ శ్రీహరి తెలిపారు.

పున్నమ్మ చెరువు.. కబ్జా

అనుమతులు లేకుండా కల్యాణ మండప నిర్మాణం ● సీఆర్‌డీఏ అధికారులు నోటీసులు జారీ చేసినా ఆగని పనులు ● వైసీపీ హయాంలో రాజ్యసభ సభ్యుడితో అధికారులపై ఒత్తిళ్లు ● అక్రమ నిర్మాణాల వద్ద తాజాగా టీడీపీ ఎమ్మెల్యే, మంత్రుల ఫ్లెక్సీలు


పున్నమ్మచెరువులో నిర్మిస్తున్న కళ్యాణ మండపం

తాడికొండ, జూలై 10: వందేళ్ల క్రితం ప్రజలు, బాటసారుల దాహర్తి తీర్చడానికి ఏర్పాటు చేసిన పున్నమ్మ చెరువు కబ్జాకు గురైంది. 23 సెంట్ల స్థలంలోని చెరువు కబ్జా కోరల్లో చిక్కుకుని కనుమరుగైంది. ఎలాంటి అనుమతులు లేకుండా చెరువు స్థలంలో కల్యాణ మండపాన్ని నిర్మిస్తున్నారు. చెరువును పూడ్చి వేసి ప్రహరి నిర్మించినా రెవెన్యూ, పంచాయతీ అధికారులు కన్నెత్తి చూడలేదు. సీఆర్‌డీఏ అధికారులకు ఫిర్యాదులు అందడంతో తప్పని పరిస్థితుల్లో నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చారు. రాజధానికి సింహద్వారంగా ఉన్న తాడికొండ అడ్డరోడ్డులో భూముల ధరలు రూ.కోట్లు పలుకుతున్నాయి. సర్వే నెంబరు 12లో 4 ఎకరాల భూమిని కొనుగోలు చేసిన వ్యక్తి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అండగల్, 1బీ, పాస్‌పుస్తకాలు లేకుండానే, లాండ్ కన్వర్షన్ చేయకుండానే పొలంలో అక్రమ నిర్మాణాలకు తెరలేపారు. అక్రమ నిర్మాణాలు చేయటంతో పాటు, చెరువును అక్రమించిన వ్యక్తిపై పలువురు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా సరే ఇంత వరకు అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడలేదు.

● వైసీపీ ప్రభుత్వం హయంలో రాజ్యసభ సభ్యుడి సహకారంతో అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి నిర్మాణాలను అడ్డుతగలకుండా చేయించారని గతంలో పని చేసిన అధికారులు చెప్తున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ నాయకులతో అంటకాగిన అక్రమ నిర్మాణదారుడు.. కూటమి అధికారంలోకి రావడంతో టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు ఫోటోలతో కూడిన ఫ్లెక్సీని చెరువు వద్ద ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేలతో సన్నిహితంగా ఉన్న ఫొటోలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంపై టీడీపీ నాయకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. చెరువు కబ్జాపై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా రికార్డులో అక్కడ చెరువు లేదని చెప్పారు. పున్నమ్మ చెరువు ఆక్రమణపై సీపీఐ పోరాటాలు చేస్తునే ఉన్నది. చెరువును కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేయడంపై సీఆర్‌డీఏ అధికారులు రెండు సార్లు నోటీసులు జారీ చేశారు. అధికారులు నోటీసులు జారీ చేసినా నిర్మాణాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి.

విద్యుత్ సరఫరాలో అంతరాయాలు జీరో స్థాయికి చేరాలి

- సాంకేతిక లోపాల్లేకుండా చర్యలు తీసుకోవాలి
- వినియోగదారుల ఫిర్యాదులకు వెంటనే స్పందించాలి
- గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ మురళీకృష్ణయాదవ్

గుంటూరు, జూలై 10: విద్యుత్ సరఫరాలో ఇకపై అంతరాయాలు జీరో స్థాయికి చేరాలని గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ ఆవుల మురళీకృష్ణ యాదవ్ ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలు, నిర్వహణపై బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో గుంటూరు టౌన్-1 ఈఈ టి శ్రీనివాసబాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ విద్యుత్‌సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాల్సిన బాధ్యత అన్ని స్థాయిల్లో ఉండాలన్నారు. వోల్టేజ్‌లో హెచ్చు, తగ్గులు, అంతరాయాలు, లోడ్ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద తలెత్తే సాంకేతిక లోపాలను పూర్తిస్థాయిలో అరికట్టాలన్నారు. దీనిపై సెక్షన్ పరిధిలోని క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి అధికారుల వరకు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. విద్యుత్ లోడ్‌కు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులపై అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యం ప్రదర్శిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు.

అక్రమంగా గ్రావెల్ తరలింపు


మోతడక వెంచర్లకు కంకర తోలుతున్న గ్రావెల్ లారీలు

తుళ్లూరు, జూలై 10: అనంతవరం నుంచి యథేచ్ఛగా గ్రావెల్ తరలుతుంది. గత వారం నుంచి మోతడక వెంచర్లకు అనంతవరం కొండ ప్రాంతం నుంచి కర్లపూడి మీదగా గ్రావెల్ వెళుతుంది. ఎక్స్‌కవేటర్‌తో తవ్వి లారీలకు లోడు చేస్తున్నారు. అనుమతులు లేకుండా గ్రావెల్‌ను తరలిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. దీనిపై మైనింగ్ డీడీ చంద్రశేఖర్‌ని వివరణ కోరగా, మైనింగ్ విజిలెన్స్ ఏడీ శివాజీని సంప్రదించాలన్నారు. ఆయనను వివరణ అడిగితే డీడీతో చెప్పాలన్నారు. ఇలా ఒకరి మీద ఒకరు చెప్పుకోవటం గమనార్హం.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121, 129,140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00



సభలో మాట్లాడుతున్న సమగ్రశిక్ష రాష్ట్రపరిశీలకురాలు డాక్టర్ వి.శారద

నాణ్యమైన విద్యనందించే బాధ్యత ఉపాధ్యాయులదే

● సమగ్రశిక్ష రాష్ట్ర పరిశీలకురాలు డాక్టర్ శారద

బాపట్ల, జూలై 10 : సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నాణ్యమైన విద్యను విద్యార్థుల దరి చేర్చే బాధ్యత ఉపాధ్యాయులదేనని టీచ్ టూల్, సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకురాలు డాక్టర్ వి.శారద తెలిపారు. సమగ్రశిక్ష, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో బాపట్లలోని సరస్వతీ మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాలలో 9 రోజులుగా జరుగుతున్న తరగతి గది టీచ్‌టూల్ అబ్జర్వర్ల శిక్షణ ముగింపు కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమానికి డాక్టర్ శారద ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పిల్లలకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలన్నారు. సక్రమమైన విద్యావ్యవస్థ లేకపోతే సమాజం కుప్పకూలుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. టీచ్‌టూల్ శిక్షణ ఉపాధ్యాయుల అభ్యాసన సామర్థ్యాలు, కృత్యాలు, విద్యార్థుల విద్యా సామర్థ్యాలు తెలుసుకునే వీలు ఏర్పడుతుందని వివరించారు. శిక్షణ అందించిన మాస్టర్స్‌ను ఆమె అభినందించారు. బాపట్ల డీఈవో గల్లా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యాభ్యాసన అభివృద్ధికి టీచ్‌టూల్ కార్యక్రమం మార్గదర్శకమన్నారు. బాపట్ల సమగ్రశిక్ష ఏపీసీ ఎంవీ సుధాకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు టీచ్‌టూల్ శిక్షణ ఎంతో ఉపయోగమన్నారు. కోర్సు డైరెక్టర్, సమగ్రశిక్ష ఎంఎంవో డాక్టర్ బిళ్లా మోజెస్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ప్రైమరీ, సెకండరీ అభ్యాసన కృత్యాలు శిక్షకులకు ఎంతగానో దోహదపడుతాయని అన్నారు. దీని ప్రకారం తరగతి గది పరిశీలన జరిగితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ టి.వీరయ్య, మాస్టర్స్ ట్రైనర్‌లు మహ్మద్ అక్రమషెరీ, పి.పోతురాజు, డి.రాజారావు, శ్రీధర్, బాలాజి, లావణ్య, ప్రవీణ, శివరామకృష్ణ, ఫణి, అజయ్ శర్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం శిక్షణ పొందిన ఉపాధ్యాయులకు సీఆర్పీలకు సర్టిఫికెట్‌లు ప్రదానం చేశారు. మాస్టర్ ట్రైనీలను సన్మానించారు.

బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా నిర్మల్‌కుమార్



నిర్మల్‌కుమార్

బాపట్ల, జూలై 10 : బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా వి.నిర్మల్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పని చేస్తున్న వి.నిర్మల్‌కుమార్‌ను బాపట్ల బదిలీ చేశారు. బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న బి.శ్రీకాంత్‌ను మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

హైవెండ్ విద్యార్థులకు అభినందనలు

కర్లపాలెం, జూలై 10 : దక్షిణ మధ్య రైల్వే భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ రీజియన్ పరిధిలో కబ్స్ అండ్ బుల్‌బుల్స్ బాల మహోత్సవంలో కర్లపాలెంలోని హైవెండ్ హైస్కూల్ విద్యార్థులు (కబ్స్) పాల్గొనటం అభినందనీయమని దక్షిణ మధ్య రైల్వే స్టేట్ కమిషనర్, క్యాంప్ ఎల్‌వోసీ డీఆర్‌కే శర్మ అన్నారు. భారత స్కౌట్ అండ్ గైడ్స్ దక్షిణాది రాష్ట్రాలకు ప్రాంతీయ స్థాయిలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల కోసం జూలై 3 నుంచి 7 వరకు సికింద్రాబాద్‌లోని లాలాగూడ రైల్వేమిక్స్‌డ్ హైస్కూల్‌లో నిర్వహించిన బాలల మహోత్సవంలో ఆంధ్రప్రదేశ్ తరుపున హైవెండ్ విద్యార్థులు పాల్గొని పలు కార్యక్రమాలలో ప్రతిభ కనబరిచినందుకు స్కౌట్ విద్యార్థులు ఎస్.పవన్‌కుమార్‌రెడ్డి, ఎం.హబీష్, కె.షణ్ముఖరెడ్డి, జి.మహేష్‌సాయి, టి.విజయనిస్సి, వి.మహేంద్రరెడ్డి, కె.ఉమా నాగచైతన్య, శివ గోపీరాజులకు ప్రశంసాపత్రాలు, మెరిట్ సర్టిఫికెట్‌లను అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. సికింద్రాబాద్‌లో కార్యక్రమం ముగించుకొని బుధవారం పాఠశాలకు వచ్చిన స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేసి ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఎం కోచ్ ఎకె రావత్తు, రైల్వే డివిజనల్ మేనేజర్ లోకేష్ విష్ణోయ్, రాష్ట్ర చీఫ్ కమిషనర్ పి.కిషోర్‌బాబు, కేరళకు చెందిన బి.ప్రియ, హైవెండ్ హైస్కూల్ చైర్మన్ ఉదయచంద్రరావు, ఎంఈఓ బొడ్డు సాయి మహేంద్రబాబు, డైరెక్టర్ పి.చాందిని, అకడమిక్ ఇన్‌చార్జి లక్ష్మీప్రసన్న ఉన్నారు.



హైవెండ్ విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందజేస్తున్న స్కౌట్ అండ్ గైడ్స్ క్యాంప్ ఎల్‌వోసీ డీఆర్‌కే శర్మ

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

బాపట్ల, జూలై 10 : హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని ట్రాఫిక్ ఎస్సై సుధాకర్ తెలిపారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు బుధవారం బాపట్ల గడియార స్తంభంసెంటర్, చీలురోడ్డు సెంటర్‌లో మోటారు వాహనాల చట్టాలు గురించి వాహనచోదకులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ఉపయోగాలు, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే కలిగే అనర్థాలు గురించి వివరించారు. రోడ్డుభద్రత నియమాలను ప్రతి ఒక్కరు పాటించాలని తెలిపారు. భద్రత, మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా తనిఖీలు ముమ్మరం చేసి కేసులు నమోదు చేయటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది విక్టర్ తదితరులు పాల్గొన్నారు.



వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్సై సుధాకర్

రాష్ట్రస్థాయి కవితల పోటీలకు ఆహ్వానం

బాపట్ల, జూలై 10 : సాహితీభారతి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కవితల పోటీలు నిర్వహిస్తున్నామని సాహితిభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ తెలిపారు. ఇతివృత్తం ఏదైన అరఠావు మించకుండా కవితలు రాసి హామీ పత్రాన్ని జతపరిచి పంపాలన్నారు. తమ కవితలను నెలాఖరులోగా ఆదంషషి కోశాధికారి రచయిత, సాహితిభారతి, జమేదారుపేట బాపట్ల-522101 బాపట్ల జిల్లా అనే చిరునామాకు పంపాలన్నారు. విజేతలకు ఆగస్టు 15న జరిగే తెలుగు సాహిత్యసభలో బహుమతులు అందజేయబడతాయని అన్నారు.

పంట డబ్బులు ఇవ్వలేదంటూ పోలీసులకు ఫిర్యాదు

బాపట్లరూరల్, జూలై 10 : పండించిన పంట డబ్బులు గుమస్తాలు ఇవ్వలేదంటూ కౌలు రైతు బుధవారం బాపట్ల రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలలోకి వెళితే.. బాపట్ల మండలం భర్తీపూడి గ్రామానికి చెందిన రావిపాటి వెంకటేశ్వర్లు 2023లో 10 ఎకరాలు కౌలుకి వరి పంటను సాగు చేసి వచ్చిన పంటను గుంటూరుకు చెందిన సముద్రాలు గురునాథంకు చెందిన గుమస్తాలైన మణేంద్ర, దార్ల శ్యామ్ అనే వారికి విక్రయించగా మొత్తం 5 లక్షల 78 వేల 925 రూపాయలు చెల్లించాల్సి ఉండగా ఆ పంట డబ్బును ఇవ్వకుండా తమ చుట్టూ తిప్పుకుంటున్నారని వాపోయాడు. దీంతో కౌలు రైతు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాతకక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడి

బాపట్లరూరల్ , జూలై 10 : పాత గొడవల నేపథ్యంలో ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటన బుధవారం బాపట్ల మండలం మద్దిబోయనవారిపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మద్దిబోయనవారిపాలెం గ్రామానికి చెందిన గవిని భవానీ శంకర్ తన గ్రామంలోని ఎరువులను ట్రాక్టర్‌పై మంగళవారం రాత్రి సమయంలో తన పంట పొలాలకు తీసుకెళుతుండగా అదేగ్రామానికి చెందిన కేశన నాగేశ్వరరావు ట్రాక్టర్‌ను ఆపి ఈ సమయంలో ఎక్కడికి వెళుతున్నావు అని బూతులు తిట్టి కత్తితో దాడి చేశాడని భవానీశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయటం జరిగిందని రూరల్ పోలీసులు తెలిపారు.

కంకటపాలెంలో తాగునీటికి కటకట

● అడుగంటిన తాగునీటి చెరువు

● కుళాయిలకు సరఫరా కాని నీరు

బాపట్ల రూరల్, జూలై 10 : బాపట్ల మండలం కంకటపాలెం గ్రామంలోని రక్షిత నీటి పథకం చెరువు నీరు లేక పూర్తి స్థాయిలో అడుగంటిపోయింది. నాలుగు వేల మందికిపైగా జనాభా ఉన్న ఈ గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడింది. తాగునీటి చెరువులో నీరులేకపోవటంతో కుళాయిలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామంలోని ప్రజలు ప్రైవేట్ ఆర్‌వో ప్లాంట్‌ల వద్దకెళ్ళి నీటిని కొనుగోలు చేసి తాగాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. గ్రామంలోని చెరువు పూర్తి స్థాయిలో అడుగంటినప్పటికి ఇంతవరకు చెరువును నీటితో నింపేందుకు అధికారులు చర్యలు తీసుకోకపోవటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధితాధికారులు గ్రామంలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసినప్పటికి వీలైనంత త్వరగా కుళాయిల ద్వారా నీటిని అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



కంకటపాలెం గ్రామంలో ఎండిపోయిన తాగునీటి చెరువు

కనీసవేతనం చెల్లించాలి... ఉద్యోగభద్రత కల్పించాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్



డీటీ శ్రీదేవికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయు నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

బాపట్ల, జూలై 10 : అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ తదితర కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్ డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, స్కీమ్‌వర్కర్స్, ఆటోకార్మికులు కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 44 రకాల లేబర్‌చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్‌కోడ్స్‌గా మార్చిందన్నారు. సీఐటీయూ బాపట్ల పట్టణ కార్యదర్శి జంగం శామ్యూల్ మాట్లాడుతూ లేబర్‌కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని, ప్రైవేటీకరణను జాతీయ నగదు బదిలీకరణ పథకం వెంటనే ఆపాలన్నారు. స్కీమ్‌వర్కర్స్‌పై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కన్వీనర్ టి.సుభాషిణి, సీఐటీయూ జిల్లా నాయకులు కె.శరత్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు సీతామహాలక్ష్మి, హేమామాలిని, డి.పద్మావతి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

● భట్టిప్రోలు, జూలై 10 : కార్మికులకు కనీస వేతనాలు అందించాలని, కార్మికుల హక్కులు హరిస్తే పోరాటం తప్పదని సీఐటీయూ మండల అధ్యక్షురాలు రమాదేవి అన్నారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో భాగంగా కార్మికుల డిమాండ్స్ డేను పురస్కరించుకుని బుధవారం మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ తక్షణమే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, ప్రైవేటీకరణను, జాతీయ నగదు బదిలీ పథకాన్ని నిలుపుదల చేయాలని, అన్ని పథకాల కార్మికులను ప్రభుత్వం గుర్తించి కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ మండల నాయకురాలు గృహలక్ష్మి, సూర్యలక్ష్మి, వరలక్ష్మి, చెల్లమ్మ, మమత, వాణి, రూపారాణి, పంచాయతీ కార్మికులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం.సత్యనారాయణ, జి.నాగరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు పి.మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

● వేమూరు, జూలై 10 : కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు బి.అగస్టీన్ డిమాండ్ చేశారు. దేశ వ్యాప్త కార్మికుల డిమాండ్స్ డేను పురస్కరించుకుని బుధవారం వేమూరు తహసీల్దార్ కేంద్రాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అగస్టీన్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు నిధులు పెంచాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని, కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం తహసీల్దార్ వి.కిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యాలయం ముందు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు కొద్దిసేపు నినాదాలు చేసి నిరసన వ్యక్తపరిచారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు బసవమ్మ, అన్నపూర్ణ, శాంతకుమారి, వేమూరి మోజెస్, మస్తానరావు పాల్గొన్నారు.

● కొల్లూరు, జూలై 10 : సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశా, పారిశుధ్య, మధ్యాహ్న భోజన కార్మికులు డిమాండ్స్ డే నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద దేశ వ్యాప్త కార్మికుల డిమాండ్స్ డే కార్యక్రమంలో భాగంగా బుధవారం సీఐటీయూ నాయకులు బొనిగల సుబ్బారావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేసి సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తున్న కార్యకర్తలు, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పంచాయితీ కార్మికులకు నూనెలు, సబ్బులు, యూనిఫాం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు న్యాయమైన కోర్కెల సాధన కోసం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు నీరజ, కాశీవిశాలక్ష్మి, బాలత్రిపుర సుందరి, భాగ్యం, సౌభాగ్యలక్ష్మి, పంచాయతీ కార్మికులు ఆదిలక్ష్మి, సుజాత, సురేష్, ఆశాలు జ్యోతి, రంగయ్య, ధనమణి పాల్గొన్నారు.

● చుండూరు, జూలై 10 : దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. సీఐటీయూ జిల్లా నాయకుడు పి.కృష్ణమోహన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి నష్టం కలిగించేలా నూతన లేబర్ కోడ్ అమలుకు సిద్ధం పడుతుందన్నారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు శ్రీమన్నారాయణ, వెంకటరెడ్డి, పద్మ, శశికళ తదితరులు పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, జూలై 10 : కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, అంగన్‌వాడీ తదితర కార్మికులకు ఉద్యోగభద్రత కల్పిస్తూ సమాన పనికి సమావేతనం చెల్లించాలని బాపట్ల జిల్లా సీఐటీయూ నాయకులు కె.శరత్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో డిమాండ్స్ డే సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ స్కీమ్ వర్కర్స్, కార్మికులు ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల డిప్యూటీ తహసీల్దార్ షేక్.కరీముల్లాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పిట్టలవానిపాలెం మండల అంగన్‌వాడీ యూనియన్ నాయకులు శ్రీలత, షేక్ హతాహర్, ప్రసన్న, అంగన్‌వాడీ కార్యకర్తలు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

● రేపల్లె, జూలై 10 : కార్మిక హక్కులు హరిస్తే పోరాటాలు తప్పదని, కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్ అన్నారు. దేశవ్యాప్తంగా కార్మికుల డిమాండ్స్‌డే సందర్భంగా కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్‌ను అమలు చేయటానికి సిద్ధపడుతుందని, ఆ చట్టాల వల్ల కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొందన్నారు. అనంతరం తదితర డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీ, రేపల్లె డివిజన్ అధ్యక్షులు సీహెచ్ వీరలక్ష్మి, డి.ప్రభాకరరావు, వాకా సుబ్బారావు, జే.ధర్మరాజు, కె.ఆశీర్వాదం, వై.కిషోర్, కె.రమేష్ పాల్గొన్నారు.



రేపల్లెలో ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు, అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు

ఉచిత వైద్యశిబిరం సద్వినియోగం చేసుకోవాలి

బాపట్ల, జూలై 10 : మండలంలోని వెదుళ్ళపల్లి గ్రామంలో గురువారం గోకరాజురామచంద్రరావు, రుక్మిణమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం, కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పరిసర ప్రాంత ప్రజలను ట్రస్ట్ సభ్యులు గోపరాజు సాంబశివరావు, గోపరాజు రామకృష్ణసుబ్బారావు, గోపరాజు సారధిలు కోరారు. ఈ విషయమై బుధవారం మాట్లాడుతూ శిబిరంలో ప్రముఖ కంటి వైద్యనిపుణులు డాక్టర్ సీహెచ్. రామ్మోహనరావు, డాక్టర్ సీహెచ్ మీన, గైనకాలజిస్ట్ డాక్టర్ జి.ఆంజనేయులు, డాక్టర్ అమృత్‌పాణి తదితరులు రోగులను పరీక్షించి వైద్య సేవలందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో శ్రావణ్, విజేత, రాహుల్, దివ్య, గురజాల శ్రీనివాసరావు, నాదెండ్ల నారాయణమూర్తి, కస్తూరి శ్రీనివాసరావు, అన్నం మస్తాన్‌రావు తదితరులు ఉన్నారు.



వివరాలు తెలియజేస్తున్న గోపరాజు రామచంద్రరావు, రుక్మిణమ్మ చారిటబుల్‌ట్రస్ట్‌నిర్వాహకులు

బురదమయంగా రహదారి

● రాకపోకలకు ఇబ్బందులు

రేపల్లె, జూలై 10 : వర్షం కారణంగా పేటేరు రోడ్డులోని ఆంజనేయస్వామి కాలనీ రహదారి బురదమయంగా మారింది. విద్యార్థులు రాకపోకలు సాగించాలంటే ప్రమాదాలకు గురౌవుతున్నారు. కాలనీ వాసులు రాకపోకలు సాగిస్తుండటంతో ద్విచక్రవాహనాలు బురదలో జారి కిందపడిపోతున్నారని, ఇప్పటికే పలుమార్లు పంచాయతీ అధికారులకు కనీసం గ్రావెల్స్ అన్న పోయించమని అడిగినా పట్టించుకోవటం లేదని, తక్షణమే పంచాయతీ సిబ్బంది రహదారిని అభివృద్ధి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.



బురదమయంగా మారిన ఆంజనేయస్వామి కాలనీ రోడ్డు

నేడు జేసీ బాధ్యతల స్వీకరణ

బాపట్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమితులైన బి.సుబ్బారావు గురువారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించనున్నారు. జగనన్న అర్బన్ శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో ప్రత్యేక అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనను బాపట్ల జేసీగా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చిన సంగతి తెలిసిందే. తొలిసారి జేసీగా పోస్టింగ్ దక్కించుకున్న ఆయన ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ ప్రాథమ్యాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పనిచేస్తామని జేసీగా బాధ్యతలు చేపట్టనున్న సుబ్బారావు తెలిపారు.

చాలీచాలని బస్టాండ్‌తో ప్రయాణికుల ఇక్కట్లు

బాపట్ల, జూలై 10 : చాలిచాలని బస్టాండ్‌తో ప్రయాణికులు నానా ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. బాపట్ల పట్టణ నడిబొడ్డున పూర్వం నుంచి రద్దీగా ఉండే పాతబస్టాండ్‌లో లయన్స్ క్లబ్ వారు ఏర్పాటు చేసిన బస్టాండ్‌ను రోడ్డు విస్తరణ పేరిట వైసీపీ పాలనలో తొలిగించారు. అతిపెద్దబస్టాండ్‌ను తొలిగించి కేవలం 10మంది కూడా కూర్చోవటానికి చాలని రేకులషెడ్‌ను నిర్మించి వదిలేశారు. ఇందులో ఆర్టీసి కౌంటర్ కూడా ఒకటి పెట్టారు. ఉన్న ఖాళీ స్థలంలో 4 బళ్ళలు వేసి వదిలేశారు. ఇందులో కూర్చోవటానికి ఖాళీలేక రోడ్డమీద నిలబడాల్సిన పరిస్థితి ప్రయాణికులకు ఏర్పడింది. నిత్యం చీరాల, గుంటూరు, విజయవాడ, రేపల్లె, హైదరాబాద్ ఇతర ప్రాంతాలకు వెళ్ళే బస్సులు మొత్తం ఇక్కడికే వస్తుంటాయి. ఆర్టీసీ బస్సులతోపాటు ప్రైవేట్‌బస్సులు కూడా వస్తాయి. వీటికితోడు ఆటోలు కూడా ఇదేప్రాంతంలో ఆటోస్టాండ్ ఉంది. దీనివల్ల ఏప్రాంతానికి వెళ్ళాలన్న ప్రయాణికులు పాతబస్టాండ్‌కు రావాల్సిందే. కాని కావాల్సిన వసతులు ఇక్కడ లేకపోవటం వల్ల రోడ్లపై ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు ఆర్టీసీ సర్వీస్‌లు కూడా గణనీయంగా తగ్గించారు. సమయపాలన అంతంతమాత్రంగా ఉంది. దీనివల్ల ప్రయాణికులు పడుతున్న ఇక్కట్లు వర్ణణాతీతం. నూతన ప్రభుత్వంలో పాలకులు దీనిపై దృష్టిసారించి బాపట్ల పాతబస్టాండ్‌కు పూర్వవైభవం తీసుకొచ్చి ప్రయాణికుల అవసరాలకు తగినవిధంగా బస్టాండ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



బాపట్ల పాతబస్టాండ్‌లో బస్‌షెల్టర్ చాలక రోడ్లపై నిలిచిన ప్రయాణికులు

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఎంసీఏ కృషి

రేపల్లె, జూలై 10 : మహిళలు పురుషులతో సమానంగా ఉండాలని, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే ఆ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉంటాయని ఎంసీఏ కార్యదర్శి పరుచూరి శ్రీనివాసరావు అన్నారు. మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ హాలులో ఎంసీఏ, అలెప్పీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మహిళలకు ఫ్యాషన్ డిజైన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దకాలంగా మహిళలకు ప్రతి సంవత్సరం ఆర్థికంగా బలపడే విధంగా ఉచిత కుట్టుమిషన్ శిక్షణ తరగతులు, ఫ్యాషన్ డిజైన్, జూట్‌బ్యాగ్‌ల తయారీపై శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం మారుతున్న కాలానుగుణంగా ఫ్యాషన్ డిజైన్ కోసం అలెప్పీ కోఆర్డినేటర్ శోభ ఆధ్వర్యంలో మహిళలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. అలెప్పీ కోఆర్డినేటర్ శోభ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, కఠినమైన పనులు కూడా సునాయాసంగా చేస్తున్నారన్నారు. ఎంసీఏ వారు మహిళలకు ప్రోత్సాహకాన్ని అందించటం అభినందనీయమని అన్నారు. అనంతరం ఫ్యాషన్ డిజైన్‌పై మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ బాల త్రిపుర సుందరి, గొట్టుముక్కల బాపారావు, ఎస్.రమేష్, పవన్, సత్యప్రసాద్, కె.సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎంసీఏ కార్యదర్శి పరుచూరి శ్రీనివాసరావు

సాగు, తాగునీటి అవసరాలు తీర్చిన ఘనత చంద్రబాబుదే

● కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ మైనేని

కొల్లూరు, జూలై 10 : పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను కృష్ణా నదిలోకి మళ్లించి కృష్ణా డెల్టాకు సాగు, తాగునీటి అవసరాలు తీరుస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కిందని కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ మైనేని మురళీకృష్ణ అన్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా తూర్పు, పశ్చిమ డెల్టాలకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, మంత్రులు కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, విజయవాడ ఎంపీ చిన్ని, ఎమ్మెల్యేలు బొండా ఉమా, యార్లగడ్డ వెంకట్రావు, మండలి బుద్ధ ప్రసాద్, వెంకటకృష్ణ ప్రసాద్, ఎమ్మెల్సీ అశోక్‌బాబుతో పాటు కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ మైనేని మురళీకృష్ణ ఎడమ, కుడి కాల్వలకు ప్రత్యేక పూజలు జరిపి బుధవారం సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టిసీమ ద్వారా కృష్ణానదికి వచ్చిన నీటిని కృష్ణ, గుంటూరు జిల్లాల్లోని తూర్పు, పశ్చిమ డెల్టాల్లో తాగు, సాగునీటి అవసరాలకు వినియోగించడం జరుగుతుందన్నారు.



ప్రకాశం బ్యారేజీ వద్ద సాగునీటి విడుదల కార్యక్రమంలో పాల్గొన్న మురళీకృష్ణ

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కిట్స్ పంపిణీ

భట్టిప్రోలు, జూలై 10 : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా కిట్లు పంపిణీ చేస్తున్నందున విద్యార్థులు సద్వినియోగపరచుకోవాలని ఎంఈఓలు ఎన్.దేవరాజ్, పి.లాజర్ తెలిపారు. మండలంలోని ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయి పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు వసతులు కల్పించడం జరిగిందన్నారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు బుక్స్, బ్యాగ్‌లతో కూడిన స్టూడెంట్స్ కిట్లను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎం.మోహనరావు, ఎంపీపీ డి.లలితకుమారి, జడ్పీటీసీ టి.ఉదయభాస్కరి, వివిధ పాఠశాలల హెచ్ఎంలు మహబూబ్ సుభానీ, సి.రామకోటేశ్వరరావు, శ్రీనివాసశర్మ, పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైలు ఎక్కుతూ జారి పడి వ్యక్తికి గాయాలు

బాపట్ల, జూలై 10 : బాపట్ల రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కుతూ కాలు జారిపడి గుర్తు తెలియని యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. బాపట్ల రైల్వేస్టేషన్ మూడో నెంబరు ప్లాట్‌ఫాం నుంచి కింద పడిన ఈ వ్యక్తి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఆయనను 108 ద్వారా స్థానిక ఏరియా వైద్యశాలకు తరలించారు.



గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి

మఖ నక్షత్ర సంపూర్ణ శాంతి పూజలు

తెనాలి మారీసుపేట, జూలై 10: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో శ్రీ సాలిగ్రామ మంఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ప్రజ్ఞానంద సరస్వతి (బాల స్వామి) భక్తులచే మఖ నక్షత్ర సంపూర్ణ శాంతి హోమాలను, ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలస్వామి నక్షత్ర శాంతి హోమ పూజలను చేయుట కలుగు ఫలితాలను వివరించారు.

దిక్సూచి DIKSUCHI

డా.వైఎస్సార్‌హెచ్‌యూ కళాశాలల్లో బీఎస్సీ(ఆనర్స్) హార్టికల్చర్

పశ్చిమ గోదావరి జిల్లా, వెంకటరామన్న గూడెంలోని డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ (డావైఎస్సార్‌హెచ్‌యూ)-'బీఎస్సీ ఆనర్స్ హార్టికల్చర్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. వర్సిటీ కళాశాలలు సహా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలు అనుబంధ కళాశాలలు ఈ ప్రోగ్రామ్‌ని అందిస్తున్నాయి. బైపీసీ స్ట్రీమ్, ఎన్ఆర్ఐ అండ్ ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్, ఇండస్ట్రియల్ స్పాన్సర్‌షిప్ కోటాల కింద అడ్మిషన్స్ నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.



బైపీసీ స్ట్రీమ్

ఈ స్ట్రీం కింద మొత్తం 541 సీట్లు ఉన్నాయి. వీటిలో 13 'పేమెంట్' సీట్లు; 168 'కేటగిరీ ఎ' సీట్లు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని రైతు కుటుంబాలకు చెందిన అభ్యర్థుల కోసం 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. ఏపీ ఈఏపీసెట్ 2024 ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. కాలేజ్ ఆఫ్ హార్టికల్చర్(వెంకటరామన్నగూడెం, అనంతరాజుపేట, పార్వతీపురం, చిన్నలతరపీ, పులివెందుల) క్యాంపస్‌లు; అనంతపురంలోని శ్రీకృష్ణ దేవరాయ కాలేజ్ ఆఫ్ హార్టికల్చరల్ సైన్సెస్, జేసీ దివాకర్ రెడ్డి హార్టికల్చరల్ కాలేజ్; ప్రకాశం జిల్లాలోని కదిరి బాబూరావు కాలేజ్ ఫర్ హార్టికల్చర్, ఎస్ఎస్ కాలేజ్ ఆఫ్ హార్టికల్చరల్ సైన్సెస్‌లలో అడ్మిషన్స్ పొందవచ్చు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/నేచురల్ సైన్సెస్ సబ్జెక్టులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ తప్పనిసరి. 2024 డిసెంబరు 31 నాటికి జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 22 ఏళ్ల మధ్య; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా

దీని కింద 15 శాతం సూపర్‌న్యూమరరీ సీట్లు ప్రత్యేకించారు. మొత్తం 56 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏపీ ఈఏపీసెట్ ర్యాంక్‌తో పనిలేదు. అకడమిక్ మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. రిజర్వేషన్‌లు వర్తించవు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బైపీసీ స్ట్రీమ్(బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులు) లేదా ఎంబైపీసీ స్ట్రీమ్(మేథమెటిక్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులు)తో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. అభ్యర్థులు పదోతరగతి నుంచి ఇంటర్ స్థాయి వరకూ ఆంగ్ల మాధ్యమంలో చదివి ఉండాలి. లేని పక్షంలో ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ టెస్ట్(ఐఈఎల్‌టీఎస్/టోఫెల్) స్కోర్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- అభ్యర్థులు పూర్తిచేసిన దరఖాస్తుతో పాటు సంబంధిత ఎన్ఆర్ఐ వీసా-పాస్‌పోర్ట్-ఆదాయం ధ్రువీకరణ పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి. ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కేటగిరీకి విద్యార్థి తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధ్రువీకరణ పత్రం కూడా సబ్మిట్ చేయాలి.

ఇండస్ట్రియల్ స్పాన్సర్‌షిప్ కోటా

దీని కింద 2 శాతం సీట్లు ప్రత్యేకించారు. మొత్తం 8 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బైపీసీ/ఎంబైపీసీ స్ట్రీమ్‌తో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- అభ్యర్థులు పూర్తిచేసిన దరఖాస్తుతోపాటు స్పాన్సర్ సంస్థకు సంబంధించిన సేల్స్ ట్యాక్స్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, పాన్ కార్డ్, గత మూడేళ్ల ఆడిటెడ్ బ్యాలెన్స్ షీట్, ఇన్‌కం ట్యాక్స్ రిటర్న్ స్టేట్‌మెంట్, ఇన్‌కార్పొరేషన్ సర్టిఫికెట్, అసోసియేషన్ మెమొరాండమ్, స్పాన్సర్‌షిప్ లెటర్ జతచేసి కింది చిరునామాకు పంపాలి.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 9
- **వెబ్‌సైట్:** https://drysrhu.ap.gov.in

వసంత్‌దాదా షుగర్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రోగ్రామ్‌లు

పుణెలోని వసంత్‌దాదా షుగర్ ఇన్‌స్టిట్యూట్(వీఎస్ఐ)-పీజీ, పీజీ డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్‌నకు నిర్దేశించిన మేరకు ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ఎమ్మెస్సీ

- ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, వైన్-బ్రూవింగ్-ఆల్కహాల్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 24 సీట్లు ఉన్నాయి.
- ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్ కోర్సుకు బీఎస్సీ(జనరల్/అగ్రికల్చర్/ఫిషరీస్/నానోసైన్స్ అండ్ నానో టెక్నాలజీ)/బీఫార్మసీ/బీఈ/బీటెక్/బీఎస్సీ(బ్లెండెడ్)పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కోర్సుకు నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో జనరల్ కెమిస్ట్రీ నుంచి 30 మార్కులకు, బయలాజికల్ సైన్సెస్ నుంచి 30 మార్కులకు, జనరల్ ఇంగ్లీష్ నుంచి 10 మార్కులకు, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ నుంచి 30 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.
- వైన్-బ్రూవింగ్-ఆల్కహాల్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌కు బీఎస్సీ(వైన్ టెక్నాలజీ/బయోటెక్నాలజీ/మైక్రో బయాలజీ/కెమిస్ట్రీ/అగ్రికల్చర్/బోటనీ/జువాలజీ/అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ/హార్టికల్చర్); పీజీడీఐఎఫ్ఏటీ/బీటెక్(కెమికల్/బయోటెక్నాలజీ) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. ఈ కోర్సుకు నిర్వహించే ఎంట్రెన్స్‌లో జనరల్ కెమిస్ట్రీ నుంచి 40 మార్కులకు, బయలాజికల్ సైన్సెస్ నుంచి 40 మార్కులకు, జనరల్ ఇంగ్లీష్ నుంచి 20 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.

పీజీ డిప్లొమా

- **షుగర్ టెక్నాలజీ(ఎస్‌టీ):** ప్రోగ్రామ్ వ్యవధి రెండున్నరేళ్లు. ఇందులో ప్రవేశానికి బీఎస్సీ(సుగర్ టెక్నాలజీ, స్టాటిస్టిక్స్/ఎంపీసీ)/బీటెక్(కెమికల్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో 50 సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో జనరల్ కెమిస్ట్రీ నుంచి 50 మార్కులకు, మేథమెటిక్స్ నుంచి 30 మార్కులకు, జనరల్ ఇంగ్లీష్ నుంచి 20 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.
- **ఇండస్ట్రియల్ ఫర్మెంటేషన్ అండ్ ఆల్కహాల్ టెక్నాలజీ(ఐఎఫ్ఏటీ):** ప్రోగ్రామ్ వ్యవధి 22 నెలలు. ఈ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి కెమిస్ట్రీ, వైన్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ, మైక్రో బయాలజీ, ఆల్కహాల్ టెక్నాలజీ సబ్జెక్టులలో ఒకటి ప్రధాన సబ్జెక్ట్‌గా బీఎస్సీ పూర్తిచేసినవారు; బీటెక్(బయోటెక్నాలజీ/కెమికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో 120 సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో జనరల్ కెమిస్ట్రీ నుంచి 40 మార్కులకు, బయలాజికల్ సైన్సెస్ నుంచి 40 మార్కులకు, జనరల్ ఇంగ్లీష్ నుంచి 20 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు.



- **షుగర్ ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ(ఎస్ఐటీ):** ప్రోగ్రామ్ వ్యవధి 18 నెలలు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్, ఎలక్ట్రానిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా బీఎస్సీ ఉత్తీర్ణులు; బీటెక్(ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు ఉన్నాయి.
- షుగర్ ఇంజనీరింగ్ డిప్లొమా(ఎస్ఈడీ): ప్రోగ్రామ్ వ్యవధి 18 నెలలు. ఇందులో ప్రవేశానికి బీటెక్(మెకానికల్/ఎలక్ట్రికల్/కెమికల్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు ఉన్నాయి.

పీజీ సర్టిఫికెట్

- **షుగర్ ఇంజనీరింగ్ సర్టిఫికెట్(ఎస్ఈసీ):** ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. డిప్లొమా (మెకానికల్/ఎలక్ట్రికల్/కెమికల్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. షుగర్‌మిల్లులో కనీసం ఏడాది అనుభవం ఉండాలి. ఇందులో 15 సీట్లు ఉన్నాయి.
- **షుగర్ మాన్యుఫాక్చరింగ్ సర్టిఫికెట్(ఎస్ఎంసీ):** ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. బీఎస్సీ(కెమిస్ట్రీ/సుగర్ టెక్నాలజీ)/డిప్లొమా(సుగర్ టెక్నాలజీ/సుగర్ మాన్యుఫాక్చర్/కెమికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. సంబంధిత విభాగంలో కనీసం రెండేళ్ల అనుభవం తప్పనిసరి. ఇందులో 35 సీట్లు ఉన్నాయి.

సర్టిఫికెట్

- **షుగర్ బాయిలింగ్ సర్టిఫికెట్(ఎస్‌బీసీ):** ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు షుగర్‌పరిశ్రమలో కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు లేదా ఇంటర్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో 60 సీట్లు ఉన్నాయి.
- **జ్యూస్ సూపర్విజన్ సర్టిఫికెట్(జేఎస్‌సీ):** ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు షుగర్‌పరిశ్రమలో కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో 30 సీట్లు ఉన్నాయి.
- **ఈటీపీ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సర్టిఫికెట్(ఈటీపీఓఎం):** ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు షుగర్‌పరిశ్రమలో కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో 30 సీట్లు ఉన్నాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 15
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీలు:** ఎమ్మెస్సీ కోర్సులకు జూలై 23న; పీజీ డిప్లొమా(ఐఎఫ్ఏటీ)కి జూలై 24న
- **ఇంటర్వ్యూలు:** జూలై 23 - 25
- **వెబ్‌సైట్:** www.vsisugar.com

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/jVHfrSTలో చదవండి.



కశ్మీర్‌లో సాంగ్ వేసుకున్న బచ్చన్

హరీశ్ శంకర్ దర్శకత్వంలో రవితేజ, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటిస్తున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్‌తో సునాహోగా' ట్యాగ్ లైన్. జగపతిబాబు, సచిన్ ఖేడేకర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ దాదాపు 90 శాతం పూర్తి చేసుకుంది. తాజాగా, ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్ 'సితార' పాటను మేకర్స్ విడుదల చేశారు. కశ్మీర్‌లోని అందమైన లొకేషన్స్‌లో సాగిన ఈ డ్యూయెట్ పాటలోని విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. సాహితీ లిరిక్స్ అందించగా, సాకేత్ కొమండూరి, సమీర భరద్వాజ్ ఆలపించారు. మిక్కీ.జే.మేయర్ సంగీతం అందించగా శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. ఈ సినిమాకు ఎడిటర్: ఉజ్వల్‌కులకర్ణి, డీఓపీ:అయనంక బోస్.

తిన్నడి విల్లు కథ



మంచు విష్ణు నటిస్తున్న 'కన్నప్ప' చిత్రం మీద 'టీజర్' అంచనాలను మరింత పెంచేసింది. తాజాగా ఈ సినిమాలో విష్ణు వాడిన విల్లుకు ఓ విశిష్టత ఉంది. అదేమిటో విష్ణు వివరిస్తూ 'తిన్నడు వాడిన విల్లు కేవలం ఆయుధం మాత్రమే కాదు.. తండ్రీకొడుకుల అనుబంధానికి ప్రతీక. కన్నప్ప తండ్రి నాదనాథ స్వయంగా తయరు చేసిన ఈ విల్లు కుటుంబ వారసత్వంగా నిలిచింది. కళాదర్శకుడు క్రిష్ ప్రత్యేకంగా ఈ విల్లు తయారు చేశాడు. కన్నప్ప దాన్ని అచంచలమైన బలంతో ఉపయోగిస్తూ తన తెగను, అడవిలో సమతూల్యతను కాపాడుకుంటాడు. యువతకు స్ఫూర్తినిచ్చే కథ ఇది' అన్నారు.

ట్రోలర్స్‌కు మంచు విష్ణు హెచ్చరిక

సినీతారల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా, వారి గౌరవానికి భంగం కలిగించేలా పోస్ట్ చేసిన వీడియోలు, మీమ్స్‌ను 48 గంటల్లో తొలగించాలని డిజిటల్ కంటెంట్ క్రియేటర్స్‌కు నటుడు, మా (మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) అధ్యక్షుడు మంచు విష్ణు బుధవారం విజ్ఞప్తి చేశారు. ట్రోలింగ్ వీడియోలను వెంటనే తొలగించని పక్షంలో తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

రాజ్‌తరుణ్ గర్ల్‌ఫ్రెండ్ బెదిరిస్తోంది

● పోలీసులకు నటి మాల్వి ఫిర్యాదు ● నార్సింగ్ ఠాణాకు మరోసారి లావణ్య



నటుడు రాజ్‌తరుణ్ గర్ల్‌ఫ్రెండ్ లావణ్య తనకు, తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి.. బెదిరిస్తున్నారని, వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ.. నటి మాల్వి మల్హోత్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన మాల్వి కుటుంబం ముంబైలో ఉంటోంది. రాజ్‌తరుణ్ చిత్రం 'తిరగబడరా స్వామి' చిత్రంలో మాల్వి కథానాయికగా నటించారు. సినిమా ప్రమోషన్ నిమిత్తం ఆమె టోలిచౌకిలో ఉంటున్నారు. రాజ్‌తరుణ్‌తో వివాదం నేపథ్యంలో లావణ్య పదేపదే తన పేరును ప్రస్తావిస్తున్నారని.. తనకు, తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి బెదిరిస్తున్నారని ఆరోపిస్తూ మాల్వి ఫిల్మ్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన పరువుప్రతిష్ఠలకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్న లావణ్యపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో కోరారు. అయితే.. మాల్వి ఉంటున్నది తమ పరిధి కాకపోవడంతో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు కేసును రాయదుర్గం ఠాణాకు బదిలీ చేశారు. కాగా.. లావణ్య బుధవారం మరోమారు రాజ్‌తరుణ్‌పై నార్సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 4న ఆమె తొలిసారి ఫిర్యాదు చేయగా.. పోలీసులు తగిన ఆధారాలను సమర్పించాలని కోరారు. దాంతో బుధవారం మరోమారు ఠాణాకు వచ్చిన లావణ్య.. పలు ఆధారాలను సమర్పించారు. వీటిల్లో 170 ఫొటోలు, సాంకేతిక ఆధారాలు, తనకు అబార్షన్ చేయించిన ఆస్పత్రి రికార్డులు ఉన్నాయి. దీంతోపాటు.. అన్విక పేరుతో తాను, రాజ్‌తరుణ్ విదేశాలకు వెళ్లిన ఆధారాలను సమర్పించారు. "పదేళ్లుగా నాతో కాపురం చేసిన రాజ్‌తరుణ్ ఇప్పుడు వదిలేస్తున్నాడు. చాలా సార్లు నా వాయిస్ కాల్స్‌ను రికార్డ్ చేశాడు. అది చట్టవిరుద్ధం. దానిపైనా చర్యలు తీసుకోండి. ఇప్పుడు రాజ్‌తరుణ్ మాల్వితో కలిసి విదేశాలకు పారిపోయేందుకు ప్రయత్నిస్తున్నాడు. వెంటనే చర్యలు తీసుకోండి" అని ఆ ఫిర్యాదులో పోలీసులను కోరారు. తనను పెళ్లి చేసుకుని, మరొకరితో తిరుగుతూ మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు నార్సింగ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

- బంజారాహిల్స్, నార్సింగ్ (ఆంధ్రజ్యోతి)


ట్రైలర్ ప్రామిసింగ్‌గా ఉంది

విష్వక్ సేన్



'పలాస 1978' ఫేమ్ రక్షిత్ అట్లూరి, సంగీర్తన విపిన్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఆపరేషన్ రావణ్'. ఈ న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌కు వెంకట సత్య దర్శకత్వం వహిస్తుండగా, ధ్యాన్ అట్లూరి నిర్మిస్తున్నారు. ఆగస్టు 2న సినిమా విడుదలవుతోంది. ఇప్పటికే రిలీజైన టీజర్ అందరినీ ఆకట్టుకుంది. బుధవారం సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన విష్వక్ సేన్ మాట్లాడుతూ "ట్రైలర్ ప్రామిసింగ్‌గా ఉంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా" అని చెప్పారు. "సినిమాలోని ప్రతీ పాత్రకూ విశిష్టత ఉంటుంది. సినిమా అందరి అంచనాలకు మించి ఉంటుంది" అని రక్షిత్ అట్లూరి చెప్పారు. "ఇప్పటివరకూ ఏ సినిమాలోనూ చూడని అంశాలు 'ఆపరేషన్ రావణ్'లో ఉంటాయి" అని దర్శకుడు వెంకట సత్య అన్నారు.

ప్రేక్షకులను రప్పించడం ముఖ్యం



సినిమా టికెట్ రేట్లు పెంచడం కంటే ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడమే ముఖ్యమని నిర్మాత డి.సురేశ్‌బాబు అభిప్రాయపడ్డారు. సంగీత దర్శకుడు తమన్, దర్శకుడు గోపిచంద్ మలినేనితో కలసి బుధవారం ఉదయం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం సురేశ్‌బాబు ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. చాలామంది ప్రేక్షకులు థియేటర్లకు రావడం లేదన్నారు. వారిని థియేటర్లకు తీసుకువస్తే సినిమా పరిశ్రమ బాగుంటుందని, ఎంతో మందికి ఉపాధి లభిస్తుందన్నారు.టికెట్ ధరల విషయంలో ఇప్పటికే ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో చర్చించగా సానుకూల స్పందన లభించిందన్నారు. ధరల విషయంలో ఏది కావాలంటే అది చేసుకోమనే వెలుసుబాటు ఇచ్చారని తెలిపారు

తిరుమల (ఆంధ్రజ్యోతి)

డ్రగ్స్‌కి దూరంగా ఉండండి



"ఫెయిల్యూర్ అనేది ఎంత ప్రమాదకరమో ఈ సినిమాలో దర్శకుడు చూపించాడు. ఈ చిత్రంలో నా ముగ్గురు పుత్రులకీ ఒక్కో సమస్య ఉంటుంది. ఇందులో కాలేజ్ లెక్చరర్ పాత్రలో నటించాను. ఈ సోషల్ మీడియా యుగంలో తల్లిదండ్రులు, పిల్లల మధ్య రిలేషన్ సరిగ్గా ఉండటం లేదు. ఇలాంటి టైమ్‌లో పిల్లలు చెడు బాట పట్టొచ్చు. పిల్లలకు తల్లిదండ్రులు మోరల్ సపోర్ట్ ఇస్తే కచ్చితంగా విజయం సాధిస్తారు. తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్ మీద పోరాటం చేస్తోంది. దయచేసి అందరూ డ్రగ్స్‌కి దూరంగా ఉండండి" అని నటుడు రాజా రవీంద్ర అన్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'సారంగదరియా'. పద్మారావు అబ్బిశెట్టి దర్శకత్వంలో ఉమాదేవి, శరత్‌చంద్ర చల్లపల్లి నిర్మించిన ఈ చిత్రం 12న విడుదలవుతోంది. బుధవారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో నవీన్‌చంద్ర మాట్లాడుతూ "ఈ సినిమా ప్రతీ ఇంట్లో జరిగే కథలా రిలేటబుల్‌గా ఉంది" అని అన్నారు.

షూటింగ్‌లో గాయపడ్డ ఊర్వశీ రౌతేలా?



బాబీ దర్శకత్వంలో నందమూరి బాలకృష్ణ హీరోగా నటిస్తున్న (ఎన్‌బీకే 109- వర్కింగ్ టైటిల్) చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఇందులో కథానాయికగా నటిస్తున్న ఊర్వశీ రౌతేలా మంగళవారం షూటింగ్‌లో గాయపడ్డారని సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. యాక్షన్ సీక్వెన్స్ చేస్తుండగా ఆమె కాలికి తీవ్రంగా గాయాలయ్యాయని, వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారని ప్రచారం జరిగింది. దీనిపై ఊర్వశి, ఆ చిత్రబృందం ఇప్పటివరకూ అధికారికంగా స్పందించలేదు. ఈ వార్తల నేపథ్యంలో బుధవారం ఊర్వశి సోషల్ మీడియా వేదికగా స్పందించారు. చికిత్స తీసుకుంటున్న వీడియోను షేర్ చేశారు. త్వరలోనే కోలుకొని సెట్స్‌కు తిరిగొస్తానని చెబుతూ విజయ సంకేతం చూపారు.

హీరోగా అద్దంకి దయాకర్



కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ సినీ రంగ ప్రవేశం చేశారు.. బొమ్మక్ మురళి దర్శకత్వంలో రూపొందిన 'ఇండియా ఫైల్స్' చిత్రంలో ఆయన హీరోగా నటించారు. ఐదు భాషల్లో తయారవుతున్న ఈ సినిమాకు ఎంఎంకీరవాణి సంగీత దర్శకుడు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ దశలో ఉన్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఇంద్రజ, బీఆర్ఎస్ నాయకుడు దాసోజు శ్రవణ్ సహా మరికొందరు రాజకీయ నాయకులు ఇందులో నటించినట్లు తెలుస్తోంది. రాజకీయంగా అవకాశాలు వచ్చినట్టే వచ్చి చేజారిపోతున్న తరుణంలో ఈ సినిమా సక్సెస్ అయితే ఆయన సినిమాల వైపు వెళతారా, లేక రాజకీయాల్లోనే కొనసాగుతారా అన్నది వేచిచూడాలి.

మోత్కూరు (ఆంధ్రజ్యోతి)

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/mITke5z లో చదవండి.

ఉచిత ఇసుక ట్రాక్టర్‌కు స్వాగతం



ఇసుక ట్రాక్టర్ ముందు ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

యద్దనపూడి (మార్టూరు) జూలై 10 : వైసీపీ పాలనలో నేతలు ఇసుకను దోచుకున్నారు. ఇసుక ధర అమాంతం పెరిగి పోవడంతో పాటు దొరక్క పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచిత ఇసుక విధానాన్ని అమలులోకి తెచ్చారు. వెనువెంటనే ఉచిత ఇసుకను అవసరమైన వారికి సరఫరా చేస్తుండడంతో పలు వర్గాల పేదలు, భవనిర్మాణ కార్మికులు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అందుకు నిదర్శనమే బుధవారం సాయంత్రం యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామంలో ఒక రైతు తీసుకువచ్చిన ఇసుక ట్రాక్టరుకు గ్రామస్తులతో పాటు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం నాయకులు ఘనస్వాగతం పలికారు.అంతేగాకుండా ఇసుక ట్రాక్టరుకు తెలుగుదేశం పార్టీ జండాలను కట్టి గ్రామంలో ఊరేగింపుచేశారు. ఈ గ్రామంలోని గన్నమనేని ఉదయ్ కుమార్ అనే రైతు చెరువు వద్ద తూమును ఏర్పాటుచేసేందుకు బుధవారం మార్టూరు లోని ఇసుకరీచ్ వద్దకు వెళ్లి 4.5 టన్నుల ఇసుకకు 2061 రూపాయలు ఆన్‌లైన్ నగదు చెల్లించారు. దాంతో రీచ్ దగ్గర ఉన్న ప్రభుత్వ సిబ్బంది రైతు తీసుకువచ్చిన ట్రాక్టరుకు ఇసుక లోడింగ్ చేయించారు.అనంతరం రైతు ఉదయ్ కుమార్ గ్రామానికి ఇసుక ట్రాక్టరును తీసుకురాగా గ్రామస్తులు ఆనందంతో స్వాగతం పలికారు. గతంలో ఇదే ఇసుకట్రాక్టరుకు 5 వేలు నుండి 6 వేలు రూపాయలు చెల్లించామని ప్రస్తుతం రెండు వేలకే అదికూడా కేవలం వివిధ టాక్సులకు మాత్రమే సొమ్ములు తప్ప ఉచితంగా ఇసుకను ప్రభుత్వం పంపిణీ చేయడం ఆనందంగా ఉందని పలువురు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

ట్రాన్స్ ఫార్మర్ ఎత్తుకెళ్లిన దొంగలు

మేదరమెట్ల , జూలై 10 : మండలంలోని తమ్మవరం గ్రామంలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. తమ్మవరానికి చెందిన ఎం.శ్రీనివాసరావు పొలంలోని ట్రాన్స్‌ఫార్మన్‌ను కింద పడవేసి అందులోని ఆయిల్‌ను పారబోసి అందులోని రాగి వైరును ఎత్తుకెళ్లరని ఈ నెల 5వ తేదీ దొంగతనం జరిగినట్లు కొరిశపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.18,750 విలువైన ట్రాన్స్ ఫార్మర్‌ను చోరి జరిగినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కొరిశపాడు ఎస్ఐ శివయ్య తెలిపారు.

ముక్తేశ్వరంలో దాహం కేకలు..!



మినరల్ ప్లాంట్ వద్ద ఫిల్టర్ చేయగా వచ్చిన వ్యర్థ నీటిని పట్టుకుంటున్న మహిళలు.. పొలాల్లో బోర్ల నీటిని ట్రాక్టర్‌పై తెచ్చుకుంటున్న ప్రజలు...ఉన్న అరకొర బోర్ల నుంచి నీటిని మోసుకుంటున్న మహిళలు... గ్రామంలో ఉన్న గిలకల బావిలో మోటార్లు వేయడంతో అడుగంటిన నీరు

- అడుగంటిన బావులు, మరమ్మతులకు గురైన చేతి పంపులు
- వాడుక నీటికీ కటకట
- పొలాలకు వెళ్లి తెచ్చుకుంటున్న ప్రజలు
- పనిచేయని పురాతన మహల్ బావి పైపులైన్
- వెంటనే చేతి పంపులను ఏర్పాటు చేసి, బావులలో పూడిక తీయించాలని విజ్ఞప్తి

బల్లికురవ, జూలై 10 : మండల కేంద్రానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న ముక్తేశ్వరం గ్రామంలో ప్రజలు తాగు నీరు, వాడుక నీరు అందక విలవిలలాడుతున్నారు. మొన్న మొన్నటి వరకు పురాతన బావులలో ఉన్న నీటిని వినియెగించుకోగా ఇప్పుడు అవి కూడా పూర్తిగా అడుగంటడంతో ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ చేతి పంపులు కూడా ఒకటి అర మాత్రమే పనిచేస్తున్నాయని వీటితో తమ పనులు సకాంలో కావటం లేదని బిందెల ద్వారా నీటిని తోడుకొని పశువులకు ఇంట్లో వాడుకకు తెచ్చుకోనే సరికే సాయంత్రం అవుతుందని ప్రజలు వాపోతున్నారు.



మహల్ బావి నీటిని తోడుతున్న మహిళలు



మహల్ బావిలో అడుగంటిన నీరు

బల్లికురవ మండలం ముక్తేశ్వరం గ్రామ పంచాయతీ అనే పేరే గాని ఈ గ్రామంలో మాత్రం తాగు, వాడుక నీరు లభించడం లేదు. గ్రామంలో ఏడు ప్రభుత్వ చేతి పంపులు ఉండగా వాటిలో మూడు మరమ్మతులకు గురికాగా నీరు వస్తోంది. బావులు రెండు ఉండగా ప్రజలు ప్రైవేట్‌గా మోటార్లను ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పుడు బావులలో కూడా నీరు అడుగంటింది. దీంతో ప్రజలు వాడుక నీటి కోసం పొలాలకు వెళ్లి ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకొని రెండు మూడు రోజులకు సరిపడా నీటిని తెచ్చుకుంటున్నారు. పక్క గ్రామాల నుంచి మినరల్ వాటర్‌ను కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. కొన్ని సమయాలలో పశువులకు తాగేందుకు నీరు లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు మహిళలు వస్త్రాలను ఉతుక్కోనేందుకు మినరల్ వాటర్ ప్లాంట్ వద్ద ఫిల్టర్ చేశాక వచ్చే వ్యర్థ నీటిని తెచ్చుకొంటున్నారు. ఇంతటి నీటి కష్టాలు ఉన్న అధికారులుగానీ పంచాయతీ వారు గానీ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామంలో ఏ నోటా విన్న నీటి కష్టాలే చెప్తున్నారు. మండల కేంద్రానికి సమీపంలో ఉన్న తమ సమస్యలను అధికారులు ఎవరు వచ్చి పట్టించుకోవడం లేదని కొత్త చేతి పంపులు వేసే వరకు గ్రామంలో ట్యాంకర్ల ద్వారా నీటిని ఇంటింటికీ అందించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న మహల్ బావి నీటిని పైపు లైన్ ద్వారా ఇంటింటికీ సరఫరా చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. వర్షాలు కురిసే వరకు పశువులకు కూడా తాగునీటి కష్టాలు తప్పవని అంటున్నారు. గిలకల బావిలో పూడిక తీస్తే కొంత వరకు మోటార్లు పనిచేసే అవకాశం ఉందని వారు తెలిపారు.

ట్యాంకర్లతో నీటిని అందించాలి



మాగ్రామంలో పురాతన బావులు, చేతి పంపుల్లో నీరు అడుగంటింది. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అధికారులు వెంటనే జోక్యం చేసుకొని ట్యాంకర్ల ద్వారా నీటిని ఇంటింటికీ అందించాలి, లేకుంటే నీటి కష్టాలు రోజు రోజుకు పెరిగే అవకాశం ఉంది.

\- ముద్ద ఏడుకొండలు, ముక్తేశ్వరం

చేతి పంపులను ఏర్పాటు చేయాలి



మా గ్రామంలో కొంత కాలం నుంచి నీటి ఎద్దడి నెలకుంది. వాడుక నీరు కూడా అందుబాటులో లేదు. పశువులకు కూడా నీరు అందడం లేదు. చేతి పంపులను ఏర్పాటు చేయాలి అలానే మహల్ బావి నీటిని పైపు లైన్ల ద్వారా అందించాలి. పురాతన బావులలో పూడిక తీయించాలి. అధికారులు మర్మతులకు గురైన చేతి పంపులను వినియెగంలోకి తీసుకు రావాలి. కొందరు నీరు లేక పొలాలకు వెళ్లి తెచ్చుకుంటున్నారు.

\- నాగండ్ల నరసింహారావు, ముక్తేశ్వరం

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న డీడీఏ విజయనిర్మల

మార్టూరు, జూలై 10 : తక్కువ ఖర్చుతో అధిక దిగుబడిని సాధించగలిగిన ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ కోఆర్డినేటరు ఎం.విజయనిర్మల అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆత్మ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ మరియు భూసార ఫలితాల ఆధారంగా సమతుల ఎరువుల వాడకంపై అవ గాహన పై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజరు మోహన్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో ఖర్చు తక్కువతో నాణ్యమైన దిగుబడిని సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టరు రాధాకృష్ణ, మరో శాస్త్రవేత్త ఎం.ఉషారాణి, ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టరు మురళీధర్, జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు రత్నకుమారి, వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సలహాలతో అధిక దిగుబడులు

బల్లికురవ : రైతులు శాస్త్రవేత్తల సలహాలు పాటించి సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ డీడీఏ విజయనిర్మల తెలిపారు. బుధవారం బల్లికురవ మండల కేంద్రంలో ఆత్మ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం, భూసార ఫలితాల ఆధారంగా సమతుల ఎరువుల వాడకం పై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, అధికారులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రతినిధులు

చీరాల, జూలై 10 : సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో బీటెక్ చదువుతున్న విద్యార్థిని జాతీయ స్థాయిలో జరిగిన తైక్వాండో పోటీలలో కాంస్య పతకాన్ని సాధించింది. పతకం సాధించిన విద్యార్థిని పందరబోయిన భానురేఖను బుధవారం కళాశాలలో కళాశాల యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు అభినందించారు. వారు మాట్లాడుతూ కళాశాలలో చదివే విద్యార్థులు చదువుతో పాటు ఇతర వ్యాపకాల్లోను ముందుండే విధంగా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నామన్నారు. అందుకు ఇదొక నిదర్శనమన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు అన్నం శ్రీనివాసరావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా వీర్లంకమ్మ కొలుపులు



చినగంజాం, జూలై 10 : మండలంలోని పెద గంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం గ్రామంలో అవనిగడ్డ కుటుంబీకుల ఇలవేల్పు దేవరి పల్నాటి వీర్లంకమ్మ అమ్మవారి కొలుపులు వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం నుంచి ఆదివారం వరకు అమ్మవారి కొలుపులు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి ఆధ్వర్యంలో అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం సత్తెమ్మ అ మ్మవారి నిలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా భక్తులు అమ్మవారికి విశేష పూజలు జరిపారు. ఆలయ షష్టమ వారికోత్సవాన్ని పురస్కరించుకొని అమ్మవారి కొలుపుల కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. అవనిగడ్డ వారి ఆడపడుచులు, గ్రామస్థుల సహకారంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

బల్లికురవ. జూలై 10 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని ఎంఈవోలు వస్త్రాంనాయక్, రమేష్‌బాబు కోరారు. బుధవారం మండలంలోని కొణిదెన ప్రాథమిక పాఠశాల (హెచ్ ఈ)లో విద్యా వికాస్ కార్యక్రమంలో భాగంగా స్టూడెంట్ కిట్లను ఆయన అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం సుచిగా, శుభ్రంగా భోజనం వండిపెట్టాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా పథకాలను తల్లిదండ్రులు వినియోగించుకొని మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

బకాయిలు చెల్లించాలి

స్వచ్ఛభారత్ కార్మికుల డిమాండ్

పంగులూరు, జూలై 10 : గ్రామ పంచాయతీలలో స్వచ్ఛభారత్ కార్మికులుగా పనిచేస్తున్న తమకు బకాయిలను వెంటనే చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు. మండలంలోని కొండమూరు, తూర్పు తక్కెళ్లపాడు గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులు సమస్యల పరిష్కారం కోరుతూ ఎంపీడీవో కార్యాలయ కార్య పర్యవేక్షకులు రమేష్‌కు బుధవారం వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మల్లారెడ్డి, సీపీఎం నాయకులు రామారావు, సంపంగిల వెంకటరావు, కార్మికులు పాల్గొన్నారు.



వార్డులో పనులను పరిశీలిస్తున్న కమిషనర్, కౌన్సిలర్

పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ

అద్దంకి, జూలై 10 : పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. అద్దంకి పట్టణంలోని 13 వ వార్డులో బుధవారం కౌన్సిలర్ విజయలక్ష్మితో కలిసి కమిషనర్ సైడ్ డ్రైన్‌లు, పారిశుధ్య పనులను పరిశీలించారు. మెయిన్ సైడ్ డ్రైన్ పూడిక తీత పనులు వేగవంతంగా చేపట్టనున్నట్లు తెలిపారు. వర్షాకాలం ప్రారంభమైనందున వర్షపు, మురుగు నీరు నిల్వ ఉండకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. టీడీపీ నేత గుంటూరు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో ఎరువులు అందించాలి

పర్చూరు, జూలై 10 : ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని రైతులకు అవసరమైన ఎరువులను సకాలంలో అందజేయాలని అధికారులకు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.మోహన్‌రావు సూచించారు. బుధవారం ఏడీఏ కార్యాలయంలో పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని పర్చూరు, ఇంకొల్లు, కారంచేడు, యద్దనపూడి మండలాల పరిధిలోని 27 పీఏసీఎస్ సొసైటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ సొసైటీల ద్వారా రైతులకు ఎరువులు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. రైతులకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం దిశానిర్దేశాలు చేస్తున్నట్లు తెలిపారు. తదనుగుణంగా అధికారులు పనిచేయాలన్నారు. పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న 27 సొసైటీలకు సంబంధించి 9 సొసైటీలు మాత్రమే ఎరువులు సప్లై చేసేందుకు లైసెన్స్ తీసుకున్నారని, మిగిలిన సొసైటీలు కూడా లైసెన్స్ తీసుకోవాని సూచించారు. కార్యక్రమంలో ఆయా సొసైటీల సీఈవోలు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రెండుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటు



ట్రాన్స్ ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

పంగులూరు, జూలై 10 : కాపర్ వైర్ చోరీకి గురై, విద్యుత్ సరఫరా లేక ఇబ్బంది పడుతున్న వ్యవసాయ పంపుసెట్లు ఉన్న ప్రదేశాలలో ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు చోరీ జరిగిన ప్రాంతాలలో ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయాలని కోరుతూ పంగులూరు సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. దీనిపై విద్యుత్ శాఖ అధికారులు స్పందిస్తూ ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఈ ఏడాది పంగులూరు, కొండమూరు, రేణంగివరం గ్రామాలలోని పొలాలలో ఆరు ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి రాగి వైరు చోరీకి గురైంది. దీనిపై స్పందించిన పోలీస్ అధికారులు చోరీకి సంబంధించి నమోదు చేసిన కేసుల వివరాలను విద్యుత్ శాఖ అధికారులకు అందచేయడంతో సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. బుధవారం పంగులూరులోని రెండు ప్రాంతాలలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయడంపై రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

అద్దంకిటౌన్, జూలై 10 : సమాన పనికి సమాన వేతనం చెల్లించడంతో పాటు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఇతర కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ మండల కార్యదర్శి పి. తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద డిమాండ్స్ డే సందర్భంగా ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ, స్కీం వర్కర్స్, వెలుగు, మెప్మా, ఉపాధి, మధ్యాహ్నం భోజన పథకం తదితర విభాగాల కార్మికులు ధర్నాలో పాల్గొన్నారు. కార్యక్రమంలో శారద, ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో కార్యదర్శి సుబ్బారావు, ప్రజా సంఘాల నాయకులు రామాంజనేయులు పాల్గొన్నారు.

వేటపాలెం(చీరాల) : కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు చొరవ చూపాలని, అప్పుడే పారదర్శకమైన సేవలు అందుతాయని సీఐటీయూ బాధ్యుడు ఎస్.బాబూరావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధ ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు బ్రహ్మయ్య, సురేష్, ఆంజనేయులు, ఏ.బ్యూలాకుమారి, పి.ప్రమీల, జె.భూలక్ష్మి, పద్మ, మేరీ అంగన్‌వాడీ బాధ్యులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందున్న అద్దంకి రోటరీ

ఘనంగా క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



రోటరీ నూతన కార్యవర్గ సభ్యులు

అద్దంకిటౌన్, జూలై 10 : అద్దంకిలోని రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ సేవా కార్యక్రమాల్లో ముందుందని రోటరీ 3150 డిస్ట్రిక్ గవర్నర్ కె. శరత్‌చౌదరి అన్నారు. బుధవారం స్థానిక వాసవీ కల్యాణ మండపంలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ 2024-25 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శరత్‌చౌదరి మాట్లాడుతూ రోటరీ సంస్థలో చేరిన సభ్యులు చురుకుగా పని చేస్తూ తక్కువ వ్యవధిలోనే నాయకత్వ స్థాయికి ఏదగాలన్నారు. మహిళలను ప్రోత్సహించి రోటరీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీసుధాకరరావు, కోశాధికారి మలాది శ్రీనివాసరావుతో శరత్‌చౌదరి ప్రమాణ స్వీకారం చేయించారు. కొత్తగా చేరిన 8 మంది సభ్యులతో రోటరీ సహాయ గవర్నర్ షేక్ మహమ్మద్ రఫీ ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ గత సంవత్సరం చేసిన కార్యక్రమాలకు మంచి అవార్డులు వచ్చాయని ఈ ఏడాది కూడా ఎక్కువగా అవార్డు వచ్చేలా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని డిస్ట్రిక్ మాజీ గవర్నర్ తాళ్ల రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా చిన్ని మురళీకృష్ణ రోటరీ భవనానికి 8 సెంట్లు స్థలం స్వాధీనం అగ్రిమెంట్‌ను నూతన అధ్యక్షుడు చప్పిడి వీరయ్యకు రోటరీ గవర్నర్ చేతుల మీదుగా అందజేశారు. పరిమళ ఫౌండేషన్ చైర్మన్, రోటేరియన్ కృష్ణరెడ్డి సమకూర్చిన కుట్టు మిషన్‌లను పేద మహిళలకు రోటరీ గవర్నర్ చేతుల మీదుగా అందజేశారు. నూతనంగా ఎన్నికైన సభ్యులకు అతిథులు, క్లబ్ సభ్యులు తదితరులు శుభాకాంక్షలు తెలిపి, సత్కరించారు. కార్యక్రమంలో చార్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ పణీంద్రబాబు, రోటరీ పెద్దలు వీరవల్లి సుబ్బారావు(రుద్రయ్య), సందిరెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ యు. దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, మన్నం త్రిమూర్తులు, సంకా బాబు, పి. ఉదయబాస్కర్ పాల్గొన్నారు.